
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
ఆదివారం 1 జూన్ 2025

పంట కాలువల నిర్వహణ, నీటి పంపిణీలో ఏఈఈల పాత్ర కీలకం. అయితే ఉమ్మడి జిల్లాలో 201 ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా కేంద్రాలకు దూరంగా ఉండే సాగునీటి ప్రాజెక్టుల్లో పనులు చేసేందుకు ఇంజనీర్లు ఆసక్తి చూపడం లేదు. శ్రీశైలం, వెలుగుగోడు ప్రాజెక్టులు, ఆదోని మైనర్ ఇరిగేషన్‌లో విధులు నిర్వహించేందుకు ఏఈఈలు ఆసక్తి చూపడం లేదు. శ్రీశైలం ప్రాజెక్టు పరిధిలోని మూడు సబ్ డివిజన్లలో 34 ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తెలుగుగంగ ప్రాజెక్టు వెలుగోడు డివిజన్, ఆదోని మైనర్ ఇరిగేషన్ సబ్ డివిజన్‌లో ఒక్క అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఏఈఈ) కూడా లేరు. లస్కర్లు కాలువల నిర్వహణ చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి కాలువలు నిర్వహణ బాధ్యతలు ఎవరు చూడాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.





ఆ ప్రాజెక్టుల్లో పని చేయం

- శ్రీశైలం, వెలుగోడు ప్రాజెక్టుల్లో విధి నిర్వహణకు ఇష్టపడని ఇంజనీర్లు
- ఉమ్మడి జిల్లాలో 201 ఏఈఈ పోస్టులు ఖాళీ
- అరకొర పనులున్న డివిజన్లలో పోస్టింగ్ కోసం ఆరాటం
- ఏఈఈల బదిలీలకు సిఫారసు లేఖలు ఇస్తున్న ఎమ్మెల్యేలు
- లస్కర్లతో నెట్టుకొస్తున్న ఉన్నతాధికారులు

కర్నూలు, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో శ్రీశైలం ప్రాజెక్టు, తెలుగుగంగ ప్రాజెక్టు, శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ (ఎస్‌ఆర్‌బీసీ), కర్నూలు-కడప (కేసీ) కెనాల్, తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ).. వంటి ప్రధాన సాగునీటి వనరులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల పరిధిలో దాదాపుగా 7.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. వీటితో పాటు చిన్ననీటి పారుదల శాఖ పరిధిలోని వివిధ చెరువుల ద్వారా సుమారుగా 45 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. ప్రాజెక్టులు, కర్నూలు ఎంఐ డివిజన్ పరిధిలో 399 మంది ఏఈఈ పోస్టులు ఉన్నాయి. అందులో 198 స్థానాలు భర్తీ చేయగా.. 201 ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 49.62 శాతం పోస్టులే భర్తీ చేశారు. వివిధ ప్రాజెక్టుల్లో పరిధిలోని డివిజన్, సబ్ డివిజన్లలో ఆనిష్పత్తి ప్రకారం పోస్టులు భర్తీ చేశారేమో అను కుంటే పొరబడినట్లే. ఎందుకంటే.. కీలకమైన సాగునీటి కాలువలు పర్యవేక్షించే డివిజన్లలో ఒక్క ఏఈఈ కూడా లేరు. ఇలాగైతే ఖరీఫ్ సీజన్‌లో నీటి నిర్వహణ ఎలా సాధ్యం..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వామ్మో.. శ్రీశైలం డ్యాంకా..?

శ్రీశైలం డ్యాంలో.. తెలుగుగంగ ప్రాజెక్టు వెలుగోడు ప్రాజెక్టుల్లో ఇంజనీర్‌గా విధులు నిర్వహించం.. మాకు ఎమ్మెల్యేల, ఎంపీల సపోర్టు ఉంది.. అని కొందరు ఇంజనీర్లు అంటున్నారు. తాము అడిగిన ప్లేస్ ఇవ్వాలని పలువురు ఇంజనీర్లు ఎమ్మెల్యేల సిఫారసు లేఖలతో బదిలీకి దరఖాస్తు పెట్టుకుంటున్నారు. కొందరైతే ఏకంగా ఎంపీ సహా ఆ పార్లమెంట్ పరిధిలో ఉండే ఆరేడుగురు ఎమ్మెల్యేల సిఫారసు లేఖలతో దరఖాస్తు చేసినట్లు తెలుస్తున్నది. చేతి నిండా పనులుండి.. నెలనెల వాటా రూపంలో డబ్బులు వచ్చే డివిజన్లు, లేదంటే ఎలాంటి పనులు లేకుండా రియల్ ఎస్టేట్ వంటి ప్రైవేటు వ్యాపారాలు చేసుకోవడానికి వీలైన క్వాలిటీ కంట్రోల్, గేజింగ్, జిల్లా కేంద్రాలకు దగ్గర ఉండే డివిజన్లలో పోస్టింగ్ కోసం పైరవీలు చేస్తున్నారు. వారికే ఎమ్మెల్యేలు సిఫారసు లేఖలు ఇస్తున్నారు. రాయలసీమ జిల్లాలకు సాగునీరు అందించే జీవనాడి శ్రీశైలం ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు పరిధిలో శ్రీశైలం డ్యాం నిర్వహణ సర్కిల్, సీ అండ్ బీ డివిజన్, డ్యాం నిర్వహణ.. వంటి మూడు డివిజన్లు ఉన్నాయి. వీటిలో 44 ఏఈఈ పోస్టులు ఉంటే 10 పోస్టులే భర్తీ చేశారు. 34 ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మిగతా 7వ పేజీలో

నేటి నుంచి రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీ

కర్నూలు కలెక్టరేట్, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 1,233 రేషన్ షాపుల ద్వారా సోవారం నుంచి నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నట్లు డీఎస్‌వో రాజా రఘువీర్ శనివారం తెలిపారు. ప్రతి నెలా 15వ తేదీలోపు రేషన్ షాపుల్లోనే ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు సరుకులు తీసుకోవచ్చని చెప్పారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి ప్రతి నెలా 5వ తేదీలోపు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయం త్రం 4 గంటల వరకు ఇంటి వద్దకే డీలర్ ద్వారా సరుకులు పంపిణీ చేయ నున్నట్లు తెలిపారు.

రేపు డీఈఈసెట్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 31 (ఆంధ్రజ్యోతి): డీఈఈసెట్-2025 కంప్యూటర్ ఆధారిత పరీక్ష సోమవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కొనసాగుతుందని డీఈవో శామ్యూల్ పాల్ శనివారం తెలిపారు. కర్నూలు జిల్లాలో మొత్తం 5 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినల్ రోల్స్‌లో పేరు, పుట్టిన తేదీ ఏమైనా సవరణలు ఉంటే పరీక్ష కేంద్రంలో సరిదిద్దుకోవచ్చని తెలిపారు. దీనికి సంబంధించిన గ్రీవెన్స్ సెల్ నెంబర్ 9885716544ను సంప్రదించాలని డీఈవో తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్లను సంబంధిత వెబ్‌సైట్‌లో డౌన్‌లోడు చేసుకోవచ్చని తెలిపారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అధికారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్. 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారీ అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

'పది' అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనం ప్రారంభం

కర్నూలు ఎడ్యుకేషన్, మే 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టౌన్ మోడల్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనం శనివారం ప్రారంభమైంది. మొదటి రోజు 3611 పేపర్ల మూల్యాంకనం చేశారు. కేంద్రంలో ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకున్నట్లు డీఈవో శామ్యూల్‌పాల్ తెలిపారు. చీఫ్ ఎగ్జామినర్లు 19 మంది, 86 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 19 మంది స్పెషల్ అసిస్టెంట్లు విధులకు హాజరయ్యారని తెలిపారు.

సీమ ఐకాన్ హైకోర్టు బెంచ్
● మంత్రి టీజీ భరత్ 7

కుట్టు.. జీవితంపై పట్టు
● కుట్టుశిక్షణపై మహిళల ఆసక్తి 6

పీఎం కిసాన్ వెరిఫికేషన్ త్వరగా పూర్తి చేయాలి


కలెక్టర్ రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తహసీల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, జిల్లా అధికారులతో యోగాంధ్ర, హౌసింగ్, రెవెన్యూ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులకు 25వేల లక్ష్యాలను కేటాయిస్తే 1,125 మాత్రమే చేశారని, త్వరితగతిన కేటాయించిన లక్ష్యాలను సాధించాలని తహసీల్దార్లను ఆదేశించారు. పీఎం సూర్యఘర్‌కు సంబంధించి 80వేల రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిపారు. వారితో మాట్లాడి రుణాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. జూన్ 10వ తేదీలోపు రోజుకు 250 ఇళ్లను పూర్తి చేయాలన్నారు. ప్రతి వారం నిర్వహిస్తున్న పీజీఆర్‌ఎస్‌లో 90 శాతం అర్జీలు రెవెన్యూ శాఖవే ఉంటున్నాయని తెలిపారు. తహసీల్దార్ల దగ్గరకు సమస్యలు రావడం లేదని, అన్నీ కలెక్టర్‌కే వస్తున్నాయని, మండల స్థాయిలో సమస్యలు పరిష్కరిస్తే కలెక్టరేట్‌కు ఎందుకు వస్తారనీ తహసీల్దార్లను ప్రశ్నించారు. జూన్ 5వ తేదీలోపు పెండింగ్‌లో ఉన్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను కూడా పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పొగాకుతో ప్రాణాలకు ముప్పు: డీఎంహెచ్‌వో



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో శాంతికళ

కర్నూలు హస్పిటల్, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకును ఏ రూపంలో తీసుకున్న నష్టమేనని పొగాకు వాడటంతో ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని కర్నూలు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ హెచ్చరించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో ప్రారంభించారు. కలెక్టరేట్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పొగ తాగడం వల్ల, నోటి దుర్వాసన, గొంతు వ్యాధులు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్, దగ్గు, ఆయాసం, రక్తపోటు, క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. బస్టాండు, రైల్వేస్టేషన్, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో పొగ తాగడం నిషేధమని, విద్యాసంస్థల పరిసరాల్లో వందగజాలలోపు పొగాకు ఉత్పత్తులను విక్రయించడం నిషేధమని తెలిపారు. అనంతరం ఆశా కార్యకర్తలతో డీఎంహెచ్‌వో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్‌సీడీ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ శైలేష్ కుమార్, డీఐవో డాక్టర్ నాగప్రసాద్, సంచార చికిత్స కార్యక్రమ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు, డీపీఎంవో డాక్టర్ ఉమా, డీపీవో విజయరాజు, డెమో శ్రీనివాసులశెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

నేడు కానిస్టేబుల్ మెయిన్స్ రాత పరీక్ష

● 16 కేంద్రాల్లో నిర్వహణ

● సీసీ కెమెరాలు, డ్రోన్లతో పర్యవేక్షణ

కర్నూలు క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంటు బోర్డు రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ కానిస్టేబుళ్ల అభ్యర్థులకు నిర్వహించే మెయిన్స్ రాత పరీక్ష ఆదివారం కర్నూలులో జరగనుంది. 16 పరీక్ష కేంద్రాల్లో 7,588 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఈ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుంది. అన్నీ పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్లతో పర్యవేక్షించనున్నారు. పరీక్ష కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో జిరాక్స్, కంప్యూటర్ కేంద్రాలు మూసివేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

సూచనలు: పరీక్ష ప్రారంభానికి గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. హాల్ టికెట్‌త పాటు ఆధార్ కార్డుతో పాటు ఇతర గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలి. ఎలాంటి డిజిటల్ వాచ్‌లు, నెట్‌తో పని చేసే వాచ్‌లను అనుమతించరు. హాల్‌టికెట్‌తో పాటు బ్లూ గానీ, బ్లాక్ పెన్ను గానీ తెచ్చుకోవాలి. సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులు అనుమతించరు. అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్ ద్వారా నమోదు చేస్తారు.

పరీక్షా కేంద్రాలు: జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సెంటర్ ఏ, బీ, నందికొట్కూరు రోడ్డులోని జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, వెంకాయపల్లె వద్ద రవీంద్ర ఇంజనీరింగ్ కళాశాల, సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీ సెంటర్ -ఏ, బీ, అలగే ఎ.క్యాంపులోని మాంటిస్సోరి సీనియర్ సెకండరీ స్కూల్, సెంటర్-ఏ, బీలో, గాయత్రి ఎస్టేట్‌లోని శంకరాస్ డిగ్రీ కాలేజీ కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. గుత్తి రోడ్డులోని మాంటిస్సోరి ఇండస్ రెసిడెన్షియల్ స్కూల్, సెంటర్-ఏ, బీ, అథీనా స్కూల్, దూపాడులోని కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, సిర్మశీ కళాశాల, పెద్దటేకూరులోని బృందావన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

400 మంది పోలీసులతో పటిష్ట భద్రత: ఎస్పీ



కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష సందర్భంగా 400 మంది పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పరేడ్ మైదానంలో బందోబస్తు విధులకు విచ్చేసిన పోలీసులకు సూచనలు ఇచ్చారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, పరీక్షలు ముగిసిన తర్వాత ఆ పత్రాలను భద్రతా నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించాలన్నారు. అభ్యర్థులకు పరీక్ష సమయంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసు వంటివి జరగకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్, కంప్యూటర్ కేంద్రాలను మూసివేసేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద పరీక్ష జరిగే సమయంలో అభ్యర్థులు కాకుండా ఇతరులు ఎవరైనా పరీక్ష కేంద్రంలో కానీ, పరీక్ష కేంద్రాల వద్ద ఉంటే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు శ్రీనివాసాచారి, హేమలత, భాస్కర్‌రావు, ప్రసాద్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు పోలీసులు ఉన్నారు.

అలుగు కోసం అలుపెరుగని పోరాటం..

- రాజకీయ పార్టీలు గళం విప్పాలి
- పాలకులు సీమపై వివక్ష వీడాలి
- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి

కొత్తపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం కోసం గత తొమ్మిదేళ్లుగా సీమ రైతాంగం అలుపెరుగక పోరాడుతున్నదని, ఎప్పటికైనా పాలకులు ప్రజలకు తలొగ్గాల్సిందేనని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. శనివారం కొత్తపల్లి మండలంలోని సప్తనదుల సంగమేశ్వరంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి అధ్యక్షతన సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాదు కేంద్రంగా పరిపాలన చేయకుండా అమరావతి కేంద్రంగా నిధులన్నీ కోస్తా ప్రాంతానికే ఖర్చు పెట్టడంతో రాష్ట్రం దివాలా తీసే పరిస్థితిని పాలకులు తీసుకొచ్చారని ఆరోపించారు. ఏపీ అంటే అమరావతి, పోలవరం అని ఒకరు, మూడు రాజధానులు అని ఒకరు తమ స్వార్థ, రాజకీయ, ఆర్థిక సామ్రాజ్యాలను నిర్మించుకోవడానికే ప్రయత్నించారే తప్ప వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఏ మాత్రం చిత్తశుద్ధితో ప్రయత్నించలేదని అన్నారు. రాయలసీమలో ప్రతి ఎకరానికి నీరు ఇస్తామని, అందుకు తగ్గట్టుగా బ్లూప్రింట్ తయారు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ దగ్గర ఉన్న ఆ బ్లూ ప్రింట్ ద్వారా ఏ విధంగా నీళ్లు ఇచ్చేదీ రాయలసీమ సమాజానికి చూపాలని డిమాండ్ చేశారు. సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం కోసం ఇన్నేళ్లుగా సీమ రైతాంగం ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. అలుగు కోసం తాము అలుపెరుగకుండా పోరాడతామని అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు కోసం వేలాది భూములను త్యాగం చేసిన నిర్వాసితుల్లో ప్రతి ఇంటికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చి నాలుగు దశాబ్దాలైనా నేటికి ఉద్యోగాలు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. పట్టిసీమ పూర్తి చేసి రాయలసీమకు నీళ్లు ఇస్తామని చెప్పిన పాలకులు అది మరిచి నేడు గోదావరి, బానకచర్ల అంటూ మరో కొత్త నాటకానికి తెరలేపి మరోసారి రాయలసీమ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు లేవంటున్న పాలకులు అమరావతి ప్రాంతంలో ఐకానిక్ టవర్ల కోసం వేలాది కోట్లు ఖర్చు పెడుతున్నారని అన్నారు. ఇది రాయలసీమ ప్రాంతం పట్ల పాలకుల వివక్షతకు నిదర్శనం కాదా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రూ.1500 కోట్లు ఖర్చు పెడితే పది లక్షల ఎకరాలకు నీరందించవచ్చని, తద్వారా పదివేల కోట్ల వ్యవసాయ ఉత్పాదన జరుగుతుందని ప్రభుత్వానికి తెలిపినా ప్రభుత్వం ఏ మాత్రం స్పందించడం లేదని విమర్శించారు. పాలకులు అధికార మత్తులో ఉంటున్నారని, రాయలసీమ పట్ల నిరంకుశ వైఖరి ఇలాగే కొనసాగితే రానున్న కాలంలో ప్రతి పల్లె- ప్రతి గడప తిరిగి ప్రభుత్వ తీరును ప్రజలకు తెలుపుతామన్నారు. సభలో బాలవుశేని, అనంతపురం రామాంజనేయులు నేతృత్వంలో కళాకారుల బృందం పాటలు పాడారు. ఈ సభకు హిందూపురం చైతన్య సొసైటీ అధ్యక్షుడు గంగిరెడ్డి, సామాజిక రాయలసీమ వేదిక కన్వీనర్ డా.నాగన్న, విరసం నాయకులు వరలక్ష్మి, పాణి, అనంతపురం ఓపీడీఆర్ రామ్‌కుమార్, భారతీయ కిసాన్ సంఘ్ కడప జిల్లా నాయకులు వెల్లాల సహదేవరెడ్డి, సీపీఎం రాజశేఖర్, మహిళా హక్కుల వేదిక నాయకురాలు మణెమ్మ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు రామకృష్ణారెడ్డి, జానోజాగో నాయకులు మహబూబ్ బాషా, యాగంటి బసవేశ్వర రైతు సంఘం నాయకులు ఎంసీ కొండారెడ్డి, కేసీ కెనాల్ పరిరక్షణ సమితి నాయకులు బెక్కం రామసుబ్బారెడ్డి, ఆదోని అభివృద్ధి వేదిక కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, పందికోన రిజర్వాయర్ సాధన సమితి నాయకులు శేషాద్రి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంగమేశ్వరంలో మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

స్వర్ణరథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మే 31(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహరించారు. శనివారం జ్యేష్ఠ పంచమి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల, విద్యుత్ దీపాల మధ్య స్వర్ణరథంపై ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తికి ఊంజల సేవ నిర్వహించారు. మఠం పండితులు భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.



శ్రీమఠంలో స్వర్ణరథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

కౌలు రైతులకు సులభంగా రుణాలు అందించాలి

జాయింట్ కలెక్టర్ నవ్య



కర్నూలు అగ్రికల్చర్, మే 31 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు ఆటంకాలను అధికమించి సులభంగా రుణాలు అందించాలని వారిని కష్టాల నుంచి గట్టెక్కించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య జిల్లా వ్యవసాయ శాఖ యంత్రాంగాన్ని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో 43 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను కంప్యూటకరీంచడం పూర్తయిందని, అందువల్ల రైతులకు త్వరితగతిన రుణాలు అందించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కేంద్ర సహకార కేంద్ర బ్యాంకు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని సీసీఆర్ కార్డులు కలిగిన కౌలు రైతులకు సహకార బ్యాంకులు రుణాలు వెంటనే అందించాలని ఆదేశించారు. వారు సాగు చేస్తున్న పొలం యజమాని పంట రుణం తీసుకుని ఉన్నట్లయితే ఆకౌంటును హోల్డ్‌లో పెట్టి, మళ్లీ వారికి రుణం ఇవ్వకుండా చూడాలని, రుణాల మంజూరులో కౌలు రైతుకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. సీసీఆర్ కార్డులను రెన్యువల్ చేసే విషయంలో నిర్లక్ష్యం వద్దని ఆదేశించారు. జిల్లాలో 10 మల్టీ పర్పస్ ఫెసిలిటీ గోదాముల నిర్మాణాన్ని చేపట్టేందుకు స్థలాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతల్లోని స్వయం సహాయక బృందాలకు రుణాలు మంజూరు చేయడంతో పాటు ఆ రుణాలు సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు జిల్లా మిల్క్ ఫెడరేషన్ సంఘాన్ని 15 రోజుల్లోగా ఏర్పాటు చేయాలని పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాసులును ఆదేశించారు. డీసీవో రామాంజనేయులు, డ్వామా పీడీ వెంకటరమణయ్య, డీసీసీబీ సీఈవో రామాంజనేయులు, వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, మెప్మా మేనేజర్ నాగశివలీల, సివిల్ సప్లయీస్ మేనేజర్ నాగసుధ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తుంగభద్ర తీరం

సాహిత్యం



నెర్రెల సీమ బతుకు కవిత్వం

- ప్రగతి పక్షాన నిలిచేదే అక్షరమని చాటే నిబద్ధత
- పలు ప్రక్రియల్లో తనదైన ముద్ర వేసిన జంధ్యాల రఘుబాబు

కర్నూలు కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): సీమలో వర్షాభావం శాశ్వతం. కరువు నిత్య సత్యం. 'అసలే రాని వర్షాన్ని/పొమ్మనవద్దు పాపా...బాబూ' అంటూ జంధ్యాల రఘుబాబు తన ఈ పుస్తకంలో 'రెయిన్ రెయిన్ డోంట్ గో' అనే కవితలో చెబుతారు. 'నీరెండి, నోరెండి, గుండె తడి లేక కన్నీరెండి/ మా బతుకులను ఎలాగైనా బతికించుకోవాలని వడివడిగా రాయిలాంటి గుండెతో ఊరెళ్లి పోతున్నది... అనే మరో కవితలో వలస బాట పడుతున్న పల్లెల జీవన స్థితిని వివరిస్తారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా మారని రాయలసీమ ప్రాంత పరిస్థితులను వివరిస్తూ తన కవితల ద్వారా ప్రజా చైతన్యం తీసుకువస్తున్నారు. రఘుబాబు నిత్య సాహితీ సేద్యకాడు, అక్షర ప్రేమికుడు. కర్నూలులో ఉంటూ బీమా సంస్థలో అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రవృత్తి రీత్యా కవిగా, విమర్శకునిగా, అనువాదకుడిగా, సమకాలీన సామాజిక రాజకీయ పరిస్థితులకు అన్వయిస్తూ వ్యాసకర్తగా బహుముఖ రూపాల్లో రాణిస్తున్నారు. ఆయన కలం నుంచి జాలువారిన కవిత్వమే 'నెర్రెలు'. అంతకు ముందు ఆయన అద్దంలో బొమ్మలు, పెట్టుడు రెక్కలు వంటి కథా సంపుటాలు, సైరా మా బళ్లారి పాటల పుస్తకం, ఔనా, చురక సంహిత పేర్లతో వ్యంగ వ్యాసాలు 500 పైగా రచించారు. సీమ కరువు వెతలు, పాలకుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించేతత్వం, ప్రజల్లో సమస్యల పట్ల చైతన్యం నింపే కవితలు జంధ్యాల రాసిన నెర్రెలు కవితా సంపుటిలో చూడగలం. తాను పుట్టి పెరిగిన నేలతల్లి పట్ల ప్రేమ, నీటి తడిని అందుకోలేని అన్యాయాల పట్ల ఆవేదన, పీడితుల గురించి నిరంతరం తపిస్తూ, ఆగ్రహిస్తూ, ఆవేశంతో రాసిన 5 పాటలు, 25 కవితలు, ఉద్యమ చైతన్యాన్ని నింపి తిరుగుబాటు బావుటాను ఎగురవేసేలాగా నెర్రెలు కవితా సంపుటిలోని కవిత్వం ఉందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ప్రముఖ కవి అన్వేషి, రాయలసీమ అభివృద్ధి నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, సీనియర్ జర్నలిస్టు పట్నాయకుని వెంకటేశ్వరరావు వంటి ప్రముఖులు నెర్రెలు కవితా సంపుటిలోని కవిత్వ వైశిష్ట్యాన్ని తమ ముందుమాట ద్వారా తెలియజేశారు. జంధ్యాల రఘుబాబు ఎవరి మెప్పు కోసమో కవిత్వం రాయలేదు. తాను చూసిన, విన్న, సమకాలీన సమస్యల గురించి అప్పటికప్పుడు స్పందించిన రాసినవే ఈ కవితలన్నీ. రాయలసీమ అభివృద్ధిని కాంక్షిస్తూ రెండు వామపక్ష పార్టీలు చేసిన బస్సుయాత్ర సందర్భంగా రాయబడిన కవితలే నెర్రెలు. నేను తిరుగుబాటును, ప్రశ్నను, పోరాటాన్ని, ఆరాటాన్ని, ఆవేదనను, ఆవేశాన్ని అంటూ ఈ నెర్రెలు కవితా సంపుటి ద్వారా కవి పీడితుల పక్షమని నిర్ధారించారు. పాలకుల పట్ల ఆగ్రహంతో, పీడితుల పట్ల ఆదరణతో దేహమంతా ఆకుపచ్చ ప్రకృతిని నింపుకున్న మనిషి కావాలిప్పుడు అంటారు ఆయన. వేల సంవత్సరాలుగా రాజ్యమేలిన పాలకుల నిర్లక్ష్యానికి గురై స్పష్టంగా ప్రాంతాల మధ్య అభివృద్ధిలో తేడాలు స్పష్టంగా కనబడతుంటే 'సంజాయిషీలు కాదు/ సత్కార్యాలు కావాలంటున్నాం...మాటలతో కడుపులు నిండవు/మాక్కావాల్సింది మాకివ్వమనే జ్ఞానం నేడు మాకొచ్చింది/బక్కచిక్కి చావడం కంటే/బద్దలు కొట్టి బతకడం ఎట్లో మాకెరుకైతాందిప్పుడు ' అని 'వేరుపడం..కానీ' అనే కవితలో చెబుతారు. తరాలుగా ఎండిన మా చేలన్నీ మూడు రుతువుల్లో కూడా నెర్రెలు ప్రసరిస్తూనే ఉన్నాయని చెబుతూ 'మా జీవితాల్లో నిరాశల్ని నింపుకునే ధాన్యాగారాలు, ఖజానాలు ఈ నెర్రెలు' అంటారు రఘుబాబు.

'ప్రాజెక్టుల జలకళలు/నాకు పచ్చదనం కావాలి/ కూలీల వలసలుల ఆగాలి/సీమ రైతు గుండెమీద చేయి వేసుకొని హాయిగా నిద్రపోవాలి' అనే తన ఆకాంక్షను పాటలు/కవిత్వం ద్వారా ఆలోచింపజేసే కవిత్వమే ఇది. ఈ పుస్తకం వామపక్ష యోధుడు, సమగ్ర రాయలసీమ నీటి ప్రాజెక్టుల విశ్లేషకుడు, రాజకీయ అర్థశాస్త్ర అధ్యాపకుడు టి. నరసింహయ్యకు అంకితం ఇవ్వడం అభినందనీయం. ఈ పుస్తకం అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలల్లో లభిస్తుంది.



- ఎన్. నాగమణి, ఎమ్మిగనూరు.

సాహిత్యమే సర్వస్వమైన పార్వతీదేవి

అక్షరమే ఆయుధమని భావించి ఆమె ఉన్నత చదువులు చదివారు. సాహిత్య భాషను లోతుగా తెలుసుకోడానికి అనేక పుస్తకాలను అధ్యయనం చేశారు. మాతృభాష ఔన్నత్యాన్ని పరిరక్షించాలనే తపనతో ఆమె తన కలాన్ని సృజనాత్మకంగా వినియోగించారు. విద్యార్థులను భాషోద్యమ బాట పట్టించారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం స్థాపనలో ప్రముఖ భూమిక పోషిస్తున్నారు. ఆమె కర్నూలుకు చెందిన డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి.

-కర్నూలు కల్చరల్, (ఆంధ్రజ్యోతి)



శ్రీశైల దేవస్థానంలో ప్రవచనకర్తగా ప్రశంసాపత్రం అందుకుంటున్న పార్వతీదేవి

- తెలుగు భాషా ఉద్యమానికి విశేష సేవలు
- నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం స్థాపనలో ప్రముఖ పాత్ర
- ప్రవచన బోధన, సాహిత్య శోధన, సామాజిక సేవల్లో 35 ఏళ్లుగా ప్రస్థానం



రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ చేతుల మీదుగా సత్కారం అందుకుంటున్న దండెబోయిన పార్వతీదేవి

వృత్తిరీత్యా డైట్ కళాశాల అధ్యాపకురాలైన దండెబోయిన పార్వతీ దేవి ప్రవృత్తి రీత్యా రచయిత్రిగా, మాతృభాష పరిరక్షకురాలిగా, ప్రవచన బోధకురాలిగా, సామాజిక సేవకురాలిగా రాణిస్తున్నారు. మారు మూల పల్లెలో సామాన్య వ్యవసాయ కుటుంబంలో పుట్టిన తనకు చదువుపట్ల ఉన్న మమకారమే ఈ స్థాయికి ఎదిగేలా చేసిందని ఆమె అంటారు.

బాల్యం.. విద్యాభ్యాసం.. కుటుంబ నేపథ్యం..

ప్రకాశం జిల్లా రాచర్ల మండలంలోని పోతంశెట్టిపల్లె గ్రామానికి చెందిన దండెబోయిన పోపులమ్మ, బాలరంగయ్య దంపతులకు 1966 ఏప్రిల్ 18న పార్వతీదేవి జన్మించారు. ఉపాధ్యాయుడైన బాలరంగయ్య చెక్కభజనలు, హరికథలు, బుర్రకథలు అంటే ఎంతో ఆసక్తి చూపేవారు. అనేక నాటకాలు రూపొందించి ప్రదర్శించేవారు. వాటిలో చిన్న చిన్న వేషాలు కూడా బాల్యంలో పార్వతితో ఆయన వేయించేవారు. అలా కళారంగంలో ఆమెకు బాల్యం నుంచి ఆసక్తి పెరిగింది. 10వ తరగతి శిరివెళ్లలో, ఇంటర్, డిగ్రీ కర్నూలు కేవీఆర్ కళాశాల్లో చదువుకున్నారు. డిగ్రీలో తెలుగు ప్రత్యేక సబ్జెక్టుగా తీసుకొన్నారు. అక్కడ అధ్యాపకులు పుల్లమాంబ, వెంకటేశ్వరమ్మల బోధన ఎంతో ప్రభావితం చేసింది. అనంతరం తిరుపతి ఎస్వీయూలో ఎంఏ తెలుగు, అక్కడే జక్కంపూడి మునిరత్నం పర్యవేక్షణలో పీహెచ్‌డీ, తర్వాత ఎంఎడ్ పూర్తి చేశారు.

మలుపు తిప్పిన వివాహం, ఉద్యోగ జీవితం...

ఉన్నత చదువు పూర్తయ్యాక నెల్లూరు జిల్లా సీతారామపురం మండలం నారాయణమ్మ పేట వాసి లక్ష్మయ్యతో 1990 ఫిబ్రవరి 14న వివాహమైంది. 1991లో ఎస్‌జీటీగా హుసేనాపురం గ్రామంలోని పాఠశాలలో పార్వతీదేవి ఉద్యోగ ప్రస్థానం ఆరంభమైంది. 1995లో గురుకుల విద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ టీచర్‌గా చేస్తూనే, అక్కడే 2011 జూనియర్ లెక్చరల్‌గా ఎంపికయ్యారు. జూపాడుబంగ్లా, కోవెలకుంట్ల, కర్నూలు గురుకులాల్లో పనిచేశారు. అనంతరం 2011లో డిగ్రీ కళాశాల అధ్యాపకురాలిగా పదోన్నతి పొంది మదనపల్లె డిగ్రీ కళాశాల, సిల్వర్‌జూబ్లీ కళాశాల, కేవీఆర్ కళాశాలల్లో పనిచేస్తూ ప్రస్తుతం ప్రభుత్వ ఉన్నత విద్యా అధ్యయన కేంద్రం (ప్రభుత్వ బీఎడ్ కళాశాల)లో అధ్యాపకురాలిగా కొనసాగుతున్నారు.

- సాహిత్యంలో తనదైన అడుగు జాడలు...

పార్వతీదేవి భాస్కర రామాయణంలోని స్త్రీ పాత్రలు - సమీక్ష, శ్రీమద్రామాయణ గానామృతం (గేయ రచన), పద్య స్ఫురణ(పద్య రచన), సూక్తిసుధ (రేడియో వ్యాసాలు), భావ వీచికలు రెండు సంపుటాలు (వ్యాస సంపుటి), పద్య స్ఫురణ (పద్యకావ్యం), బ్రహ్మగుండం చరిత్ర (ఆలయ చరిత్ర), కోడూరి కౌసల్యాదేవి రచనలపై సద్విమర్శ (విశ్లేషణ పుస్తకం), తెలుగు ఊసులు (కవితా సంపుటి) తదితర పుస్తకాలు రాశారు. సుందరకాండ (గేయాల సీడీ) మొదలైనవి రాశారు.



- తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమంలో...

మాతృభాషలో బోధన జరగాలని, కార్యాలయాల్లో మాతృభాషను వినియోగించాలని తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థలో చేరి అనేక చైతన్య కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులతో చర్చాగోష్ఠులు, ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించారు.

- నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘంలో కీలక భూమిక...

మహిళలు చదువుకొని సమాజంలో తమదైన పాత్ర పోషించినప్పుడే ఆ కుటుంబం, ఆ సమాజం బాగుంటుందని నమ్మిన డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) స్థాపనలో కీలక భూమిక పోషించారు. నరసం ద్వారా కొత్త రచయిత్రుల పుస్తకాలను వెలుగులోకి తీసుకువస్తున్నారు.



గిడుగు పురస్కారం అందుకుంటూ..



పార్వతీదేవి రాసిన సాహిత్య పుస్తకాలు

ప్రతిభకు పురస్కారాలు ఎన్నో..

2008లో ఉగాది పురస్కారం, 2009లో ఉగాది కవిసమ్మేళన సత్కారం, విశిష్ట మహిళా పురస్కారం, శ్రీకృష్ణదేవరాయల 500 పట్టాభిషేక పురస్కారం, 2010లో ఉత్తమ అధ్యాపక పురస్కారం, 2012లో 4వ ప్రపంచ తెలుగు మహాసభల పురస్కారం, 2013లో తానా పురస్కారం, 2015లో తెలుగు కళా సమితి పురస్కారం, 2016లో ఉత్తమ రచయిత్రుల పురస్కారం, ఉత్తమ సేవా పురస్కారం, తిరుపతి పద్మావతి మహిళా కళాశాలచే ఉత్తమ వక్తగా పురస్కారం, 2017లో లయన్స్ క్లబ్‌చే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, గాడిచర్ల విశిష్ట మహిళా పురస్కారం, తెలంగాణ ప్రపంచ మహా సభల ప్రశంసాపత్రం, 2019 నుంచీ 2022 వరకు శ్రీశైల దేవస్థానంలో ఉత్తమ ప్రవచన కర్తగా పురస్కారం, 2022 వైజాగ్‌లో గిడుగు పురస్కారం

నేడు కంచి వర్సిటీలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌కే మనోహర్ రావు

కర్నూలు కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖండేరి వీధిలోగల శంకరాచార్య మఠం (శంకర మఠం)లో ఆదివారం కంచి యూనివర్సిటీలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్‌కే మనోహర్‌రావు తెలిపారు. శనివారం శంకర మఠంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమిళనాడులోని కంచిలో కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో గత 30 ఏళ్లుగా కొనసాగుతున్న చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయం (కంచి యూనివర్శిటీ)లో 2025-26 విద్యాసంవత్సరానికి ఇంజనీరింగ్, ఆయుర్వేదం, మేనేజ్‌మెంట్, పీజీ కోర్సులలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు చేపడుతోందని తెలిపారు. కంచి యూనివర్శిటీ అధికారులే నేరుగా ప్రవేశాలకు ఇక్కడ అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లి దండ్రులు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి శంకర మఠంలో జరిగే స్పాట్ అడ్మిషన్లలో పాల్గొనవచ్చని తెలిపారు. , ఆయా కోర్సులు, ఫీజుల వివరాలు యూనివర్శిటీ అధికారులు తెలియజేస్తారని తెలిపారు. సమాఖ్య గౌరవ సలహాదారు కె. రంగనాథ శర్మ, కార్య నిర్వాహక కార్యదర్శి కళ్లే చంద్రశేఖర శర్మ, సభ్యులు హెచ్‌కే రాజశేఖర్ రావు, హరిహర నాథశర్మ, నర సింహారావు, మధుసూదన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సుస్థిర పత్తి ఉత్పత్తి పద్ధతులపై

అవగాహన కల్పించండి

కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు అగ్రికల్చర్, మే 31 (ఆంధ్రజ్యోతి): పొలాల సారాన్ని పెంచి సుస్థిరమైన పత్తి అధికోత్పత్తి సాధించేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నేల ఆరోగ్య సంరక్షణ, పత్తిలో పంట రక్షణ యాజమాన్యం బుక్‌లెట్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే పత్తి సాగులో మొదటి స్థానంలో ఉన్న కర్నూలు జిల్లాలో రైతులకు పత్తి పంటలో అధిక ఉత్పత్తి, పంట రక్షణకు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛంద సేవా సంస్థలతో కలిసి జిల్లా వ్యవసాయ శాఖ చేపట్టిన బెటర్ కాటన్ ప్రాజెక్టు కార్యక్రమం కోడుమూరు, దేవనకొండ మండలాల్లో అమలు చేస్తామన్నారు. దాదాపు 8,075 మంది రైతులతో ఈ కార్యక్రమం అమలు జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జేసీ డా.బి. నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ, వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి పాల్గొన్నారు.

సామాజిక సేవకు సిద్ధం కావాలి

- జేవీవీ వ్యవస్థాపకుడు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి
- టీజీవీ క్షేత్రంలో ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు



మహమ్మద్‌మియాకు మెమెంటో అందజేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవకు అందరూ సిద్ధం కావాలని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి అన్నారు. శనివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రధానోపాధ్యాయుడు, టీజీవీ కళాక్షేత్రం ప్రధాన కార్యదర్శి, కళాకారుడు మహమ్మద్‌మియా పదవీ విరమణ సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా దృక్పథంతో మహ్మద్ మియా జనవిజ్ఞాన వేదికలో దశాబ్దాలుగా పని చేశారని అన్నారు. అనంతరం ఉద్యోగులకు పదవీ విరమణ ఉన్నా, కళలకు ఉండదని, కళాకారులైన ఉద్యోగులు కళారంగంలో మరింత రాణించాలని మాజీ రాష్ట్ర మంత్రి కేఈ ప్రభాకర్ ఆకాంక్షించారు. రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆదర్శప్రాయంగా విద్యార్థులు బోధన చేయాలని అన్నారు. కథా రచయిత ఇనాయతుల్లా వ్యాఖ్యాతగా వ్యవహరించిన సబ్ కలెక్టర్ మల్లికార్జున, కేడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్మన్ మల్లికార్జున రెడ్డి, ప్రతిభ విద్యాసంస్థల అధినేత ఎం. అరుణాచలం రెడ్డి, కట్టమంచి విద్యాసంస్థల అధినేత కట్టమంచి జనార్దనరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేజీ గోవిందరెడ్డి, బీసీ సంఘాల నాయకుడు నక్కలమిట్ట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం (పడకసీను) పౌరాణిక పద్య నాటకం ప్రదర్శన ఆకట్టుకుంది. కృష్ణుడిగా పి. దస్తగిరి, దుర్యోధనుడిగా చల్లా నవీన్‌కుమార్ నాయుడు, అర్జునుడిగా కె. బాలవెంకటేశ్వర్లు నటించారు. నాట్యాచార్యుడు కరీముల్లా శిష్యబృందం ప్రదర్శించిన జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి.



శ్రీకృష్ణ రాయబారం నాటకంలోని ఓ సన్నివేశం

కుట్టు జీవితంపై పట్టు

నంద్యాల నూనెపల్లె, మే 31 (ఆంధ్రజ్యోతి) : కుట్టు పని నేర్చుకొని జీవితంపై పట్టు సాధిస్తున్నారు నేటి మహిళలు. వైసీపీ పాలనలో నిర్వీర్యంగా మారిన కార్పొరేషన్ల వ్యవస్థకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి జీవం పోసింది. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అర్హులైన మహిళలకు ఉచిత కుట్టుశిక్షణను అందించి శిక్షణ అనంతరం కుట్టుమిషన్‌ను అందజేసి తమ కాళ్లపై తాము నిలబడేలా చర్యలు తీసుకుంది. బీసీ కార్పొరేషన్ ద్వారా కమ్మ, రెడ్డి, కాపు, ఈబీసీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ కులాలకు సంబంధించిన మహిళలకు ఈ అవకాశం కల్పించింది. ఇప్పటికే దరఖాస్తు చేసుకొని ప్రభుత్వం కేటాయించిన కేంద్రాల్లో మహిళలు అల్లికలు, కుట్టుమిషన్ శిక్షణను తీసుకుంటున్నారు. ఆధునిక ప్రపంచంలో వినూత్న వస్త్రధారణకు ప్రాధాన్యం పెరిగింది. చక్కటి నైపుణ్యంతో ఆకట్టుకోగలిగే డిజైన్లను రూపొందించినవారికి ఆదాయానికి కొదవలేదు. ఈ క్రమంలో బొటిక్స్ వంటి ఫ్యాషన్ వర్క్స్‌కు మార్కెట్లో బాగా డిమాండ్ పెరిగింది. స్వయం ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు. ఆసక్తి ఉన్న బీసీ, ఆర్థికంగా వెనుకబడిన మహిళలు వార్డు, గ్రామ సచివాలయాలతోపాటు మండల పరిషత్ కార్యాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకొని శిక్షణ పొందుతున్నారు.



నంద్యాలలో ఉచిత కుట్టులో శిక్షణ పొందుతున్న మహిళలు

- కుట్టుశిక్షణపై ఆసక్తి
- ఉపాధికి బాటలు వేసుకుంటున్న మహిళలు
- బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ట్రైనింగ్
- జిల్లా వ్యాప్తంగా 23కేంద్రాల నిర్వహణ
- శిక్షణ అనంతరం కుట్టుమిషన్ అందజేత

90 రోజుల పాటు శిక్షణ



బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన మహిళలకు ప్రభుత్వం ఉచిత కుట్టుశిక్షణ అందిస్తోంది. 90రోజులపాటు శిక్షణ ఉంటుంది. శిక్షణలో 75శాతం హాజరు ఉన్న మహిళలకు ఉచితంగా ఒక కుట్టుమిషన్‌ను ప్రభుత్వం అందజేస్తుంది.

- జాకీర్‌హుసేన్, ఉమ్మడి కర్నూలు జిల్లా ఈడీ, బీసీ కార్పొరేషన్



నంద్యాలలోని ఓ కేంద్రంలో అల్లికలు నేర్చుకుంటున్న మహిళలు

కలెక్టర్ పర్యవేక్షణలో..

బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజకుమారి పర్యవేక్షణలో జిల్లాలో 25కేంద్రాలను ఎంపిక చేయగా వాటిలో 23కేంద్రాల్లో ఉచితంగా కుట్టుశిక్షణను నిర్వహిస్తున్నారు. మిగిలిన రెండు కేంద్రాల్లో కూడా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వం జిల్లాకు 3,441 మందిని లక్ష్యంగా ఉచిత కుట్టు శిక్షణకు నిర్దేశించారు. 90రోజులపాటు నిర్వహించే ఈశిక్షణకు 75శాతం హాజరు తప్పనిసరిగా నిర్ణయించారు. ప్రతి కేంద్రానికి ఒక శిక్షకురాలు, ఒక ఆపరేటర్‌ను నియమించారు. శిక్షణ పూర్తయిన అనంతరం ప్రభుత్వం ఒక కుట్టుమిషన్‌ను ఉచితంగా అందజేయనుంది.



నంద్యాలలో శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ రాజకుమారి (ఫైల్)

ఓ వైపు డీఎస్సీ.. మరోవైపు కుట్టు శిక్షణ



టీటీసీ పూర్తిచేసి డీఎస్సీకి సిద్ధపడుతున్నాను. కుట్టుపై ఆసక్తి ఉన్నప్పటికీ బయట నేర్చుకోవాలంటే రూ.10వేలకుపైగా ఖర్చవుతుంది. ప్రభుత్వం ఉచితంగా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడంతో మెలకువలు నేర్చుకుంటున్నాను.

- షేక్ కరిష్మా

కుటుంబానికి భరోసాగా..



బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తిచేసి గృహిణిగా ఉంటున్నాను. ఖాళీగా ఉండకుండా కుట్టులో శిక్షణ తీసుకుంటున్నా. శిక్షణ అనంతరం బొటిక్స్ ఏర్పాటుచేసి కుటుంబానికి భరోసాగా నిలవాలన్నది లక్ష్యం. ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ అభినందనీయం. - ఎం.భూలక్ష్మి

స్థిరమైన ఆదాయ మార్గం



ఇంటివద్దే ట్యూషన్ చెప్పుకుంటూ జీవిస్తున్నా. భర్తను కోల్పోవడంతో ఆర్థికంగా కుంగిపోయాం. స్థిరమైన ఆదాయం కోసం ఎంబ్రాయిడర్ నేర్చుకోవాలనుకున్న తరుణంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత కుట్టుశిక్షణ ఎంతగానో ఉపయోగపడనుంది. - కవిత

11న పీసీసీ అధ్యక్షురాలి రాక

- వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేయాలి
- కర్నూలు నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా

కర్నూలు అర్బన్, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 11 జిల్లాలో పర్యటించనున్నారని ఆ పార్టీ నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా పిలుపునిచ్చారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయంత్రం 3 గంటలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగే కార్యకర్తల సమావేశం అనంతరం జిల్లాలోని నియోజకవర్గాల కోఆర్డినేటర్లు, నగర కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకుల పార్టీ బలోపేతానికి షర్మిల దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో పర్యటనలో భాగంగా ఆమె కర్నూలు జిల్లాలో కూడా పర్యటించనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ఎన్నికల ముందుకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ పర్యటనలో ప్రధాన అంశాలపై చర్చిస్తారని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, అనంతరత్నం మాదిగ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి. బ్రతుకన్న, బజారన్న, ఎస్.ప్రమీల, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖలో పలువురి పదవీ విరమణ


పదవీ విరమణ పొందిన వారితో కర్నూలు ఎస్పీ

కర్నూలు క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో శనివారం పలువురు పోలీసులు పదవీ విరమణ పొందారు. కర్నూలు డీపీవో ఏవో విజయకుమార్ నాయుడు, సీఐ సుగుణ కుమారి, సీసీఎస్ ఎస్ఐ రావూఫ్, ఎస్బీ ఎస్ఐ కొండయ్య, పీసీఆర్ ఎస్ఐలు ఉమాపతి, మహబూబ్ బాషా, ఆదోని తాలుకా ఎస్ఐ నారాయణలు ఈ పదవీ విరమణ పొందిన వారిలో ఉన్నారు. వీరందరినీ స్థానిక జిల్లా పోలీస్‌కార్యాలయంలో ఎస్పీ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుశేన్‌పీరా పాల్గొన్నారు.

నంద్యాల టౌన్: నంద్యాల జిల్లాలో పదవీ విరమణ పొందిన పోలీసులను ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సన్మానించారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో వారితో పాటు వారి కుటుంబ సభ్యులను సన్మానించి అనంతరం జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విరమణ అనంతరం ఆరోగ్యంపై శ్రద్ధ ఉంచాలన్నారు. నంద్యాల ట్రాఫిక్‌లో పని చేస్తున్న ఎస్సై లక్ష్మయ్య, నంద్యాల డీసీఆర్‌బీలో పని చేస్తున్న ఎస్సై శంకరరావు, రిజర్వ్‌డ్ హెడ్‌కానిస్టేబుల్ జగన్మోహన్‌రెడ్డి శనివారం పదవీ విరమణ పొందారు. ఏమైనా సమస్యలు ఉన్న తనకు తెలపాలని వారికి ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో సాయుధ బలగాల అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, జిల్లా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పదవీ విరమణ పొందిన పోలీసులతో నంద్యాల ఎస్పీ

సిద్ధేశ్వరం అలుగు నిర్మాణంలో నిర్లక్ష్యం

నంద్యాల రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): సిద్ధేశ్వరం అలుగు నిర్మించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు లక్ష్మీనరసింహయాదవ్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా ఉద్యమం చేస్తున్న సిద్ధేశ్వరం ప్రాజెక్ట్ నిర్వహణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి అర్థమౌతున్నదన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జాకీర్‌హుసేన్, ఉపాధ్యక్షుడు పఠాన్‌అబుఖాన్, జాకీర్‌హుస్సేన్, బాలస్వామి, రజాక్‌వలి, చెన్నయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

'డీసీఎంఎస్'ను బలోపేతం చేస్తాం

- చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అగ్రికల్చర్, మే 31 (ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ మార్కెంట్ సొసైటీ(డీసీఎంఎస్)ని బలోపేతం చేస్తామని చైర్మన్ నాగేశ్వరరావు అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమిస్తూ వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ జారీచేసిన జీవో ఆర్‌టీ నెంబర్ 366 పత్రాలను శనివారం వై.నాగేశ్వరరావు యాదవ్‌కు మేనేజర్ రాజేష్ అందజేశారు. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ డీసీఎంఎస్ కేంద్రాలకు తప్పనిసరిగా ఎరువులను పూర్తిస్థాయిలో అందించి రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. మార్క్‌ఫెడ్ సంస్థ నుంచి డీసీఎంఎస్‌కు రావాల్సిన బకాయిలను వసూలు చేస్తామన్నారు. ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుతామని డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాలకు ఎక్కడెక్కడ సొంత భవనాలు ఉన్నాయో?, విలువైన స్థలాలు ఎక్కడ ఉన్నాయో? గుర్తించి వాటిని రైతులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో డీసీఎంఎస్ నిర్వీర్యమైపోయిందని, ఎరువులు కూడా ఈసంస్థకు చెందిన కేంద్రాల ద్వారా అందించకుండా ఆనాటి పాలకులు నిర్లక్ష్యం చూపారని అన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో రైతుల ప్రయోజనాలే ముఖ్యంగా పని చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు.

50 మందికి కారుణ్య నియామకాలు

- జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

కర్నూలు కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాల కింద 50 మందికి జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు ఇస్తూ కలెక్టర్ పి. రంజిత్ బాషా అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు కలెక్టర్ నియామక పత్రాలు అందజేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెట్‌లుగా ఐదుగురికి, పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-4గా నలుగురికి, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలుగా 9 మందికి, మహిళా పోలీసుగా ఒకరికి, రెవెన్యూ డిపార్టుమెంటులో జూనియర్ అసిస్టెంట్లుగా ఐదుగురికి, వివిధ డిపార్టుమెంట్లలో జూనియర్ అసిస్టెంట్లుగా 26 మందికి మొత్తం 50 మందికి ఆయన ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. వీరికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగ నియామక పత్రాలు అందజేసినందుకు కలెక్టర్ డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఏవో విజయశ్రీలను కలెక్టర్ అభినందించారు.

శ్రీశైలానికి వచ్చిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



స్పీకర్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, మే 31 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి వార్ల దర్శనార్థం ఏపీ రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు శ్రీశైలం చేరుకున్నారు. అయ్యన్నపాత్రుడు, ప్రముఖ గాయకుడు మనోకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్వాగతం పలికారు.

ఆ ప్రాజెక్టుల్లో పని చేయం

5వ పేజీ తరువాయి

నైరుతి పవనాలు ముందుగానే రావడంతో డ్యాంకు జూన్‌లో వరద చేరే అవకాశాలు ఉన్నాయి. 2009 నాటి వరద వస్తే కరువు రైతుల ప్రాణనాడి అయిన శ్రీశైలం డ్యాం రక్షణ ఎలాసాధ్యం..?.. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఈ ప్రాజెక్టు భద్రత పట్టదా..?.. ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు కాలువ ద్వారా జిల్లాలో దాదాపు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. నంద్యాల, కడప జిల్లాకు ఎన్టీఆర్ తెలుగు గంగ కాలువ ద్వారా కృష్ణాజలాలు మళ్లించాలంటే వెలుగోడు జలాశయం ఎంతో కీలకం. టీజీపీ వెలుగోడు డివిజన్ పరిధిలో 17 ఏఈఈ పోస్టులు ఉంటే ఒక్క ఏఈఈ కూడా లేరు. 17 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎస్ఆర్‌బీసీ బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల డివిజన్లది దాదాపు ఇదే పరిస్థితి.



క్వాలిటీ కంట్రోల్ డివిజన్లు ఫుల్

క్వాలిటీ కంట్రోల్ (క్యూసీ) కర్నూలు డివిజన్‌లో 12 ఏఈఈ పోస్టులకు గాను 10 పోస్టులు భర్తీచేశారు. క్యూసీ నంద్యాల డివిజన్‌లో 12 పోస్టులకు గాను 9 పోస్టులు భర్తీ చేశారు. కర్నూలు ప్రాజెక్ట్ పరిధిలోకి వచ్చే అనంతపురం క్యూసీ డివిజన్‌లో 12 పోస్టులకు 11 పోస్టులు భర్తీ చేశారు. అంటే.. ఈ మూడు డివిజన్లలో 23 ఏఈఈ పోస్టులు ఉంటే.. 30 పోస్టులు భర్తీ చేశారు. ఇలాంటి డివిజన్లు చాలానే ఉన్నాయని ఇంజనీరింగ్ అధికారులు అంటున్నారు. జిల్లా, డివిజన్ కేంద్రాలకు దగ్గరగా ఉంటూ ఎలాంటి పనులు లేని డివిజన్లలో పోస్టింగ్‌ల కోసం పలువురు ఏఈఈలు ఆసక్తి చూపుతున్నారు. అంతేకాదు.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఏఈఈలకు డీఈఈగా పదోన్నది ఇవ్వడంతో మెజార్టీగా ఖాళీలు ఏర్పడ్డాయి. ఆ ఖాళీలను తక్షణమే భర్తీ చేసి ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీటి పంపిణీకి చర్యలు చేపట్టాలని పలువురు పేర్కొంటున్నారు. లేదంటే.. లస్కర్లే ఇంజనీర్లుగా విధులు నిర్వర్తించక తప్పదని ఓ ఎస్ఈ పేర్కొనడం కొసమెరుపు.

- వివిధ ప్రాజెక్టు పరిధిలో ఏఈఈ పోస్టులు, ఖాళీలు వివరాలు

ప్రాజెక్టు/కాలువలు	డివిజన్లు	ఏఈఈ పోస్టులు	భర్తీ చేసినవి	ఖాళీలు
శ్రీశైలం డ్యాం	4	54	16	38
తెలుగుగంగ ప్రాజెక్టు	6	72	29	43
ఎస్సార్బీసీ సర్కిల్-1 నంద్యాల	7	96	69	27
ఎస్సార్బీసీ సర్కిల్-2 నంద్యాల	5	71	12	59
క్వాలిటీ సెల్	3	36	30	6
మొత్తం	22	329	156	173
కేసీ కెనాల్ డివిజన్	4	20	15	5
టీబీపీ ఎల్లెల్సీ డివిజన్	4	20	15	5
గురురాఘవేంద్ర ప్రాజెక్టు	3	12	2	10
ఎం కర్నూలు డివిజన్	5	18	10	8
మొత్తం	38	399	198	201

ప్రభుత్వానికి నివేదిక పంపాం

ఉమ్మడి ఇల్లాలో వివిధ ప్రాజెక్టు పరిధిలోని డివిజన్ల వారిగా ఏఈఈ పోస్టులు ఖాళీల వివరాలు ప్రభుత్వానికి పంపించాం. కీలకమైన శ్రీశైలం డ్యాం, ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు వెలుగోడు, ఆళ్లగడ్డ డివిజన్లలో ఏఈఈ పోస్టులు చాలా ఖాళీగా ఉన్నమాట నిజమే. బదిలీలలో ప్రభుత్వం వీటిని భర్తీ చేసే అవకాశం ఉంది.

- కబీర్‌బాషా, సీఈ, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్, కర్నూలు

సీమ ఐకాన్ హైకోర్టు బెంచ్

- కర్నూలు స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం ప్రణాళిక
- తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్చలు
- ఓర్వకల్లు - లేపాక్షి ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి
- మంత్రి టీజీ భరత్



కర్నూలు, మే 31 (ఆంధ్రజ్యోతి): అమరావతి హైకోర్టు తరహాలో రాయలసీమ ఐకాన్‌గా కర్నూలు హైకోర్టు బెంచ్ భవనం నిర్మాణానికి సీఎం చంద్రబాబు సంకల్పిస్తున్నారని, అన్ని అనుమతులు ఇచ్చి త్వరలో బెంచ్ ప్రారంభిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. శనివారం స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడతూ కడప మహానాడు దిగ్విజయం చేయడంతో జిల్లా నాయకులు బాగా కష్టపడ్డారని, నాయకులు సీఎం చంద్రబాబు, యువనేత, మంత్రి నారా లోకేశ్ అభినందించారని అన్నారు. ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి జూలై 2న విజయవాడకు విమాన సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. మొదట వారంలో మూడు రోజులు, ఆ తరువాత రోజువారి సర్వీసులు నపడంతో పాటు దేశంలో షిర్డీ, చెన్నై, బెంగళూరు సహా వివిధ నగరాలకు సర్వీసులు ప్రారంభించేందుకు కేంద్ర విమానాయ శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు హామీ ఇచ్చారని తెలిపారు. అమరావతిలో హైకోర్టు భవనం ఐకాన్ భవనంగా నిర్మాణం చేస్తున్నారని, అదే తరహాలో కర్నూలు హైకోర్టు బెంచ్ భవనం నిర్మాణానికి సీఎం చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ కసరత్తు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే జోహరాపురం, జగన్నాథగట్టు వంటి ప్రాంతాల్లో మూడు చోట్ల అవసరమైన భూమిని కలెక్టరు పి. రంజిత్‌బాషా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కర్నూలు నగరం స్మార్ట్‌సిటీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఖేలో ఇండియా పథకం అమలు సహా నగరంలో రహదారులు, డ్రైన్లు నిర్మాణానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. తుంగభద్ర నదిపై అవసరమైన చోట చెక్ డ్యాం నిర్మాణానికి అవకాశాలను పరిశీలిస్తామన్నారు.

ఆస్పత్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తా

రాయలసీమ ప్రజల వైద్యం, ఆరోగ్యం హబ్‌గా ఉన్న కర్నూలు సర్వజన వైద్యశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని మంత్రి టీజీ భరత్ వివరించారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణాలు పూర్తి చేయడానికి కృషి చేస్తానని అన్నారు.

త్వరలో జైరాజ్ ఇస్పాత్ ప్రారంభం

రాష్ట్ర విభజనం తరువాత సీఎం చంద్రబాబు ఓర్వకల్లు పారిశ్రామి హబ్‌గా ఏర్పాటు చేయడంతో పాటు 2018లో జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారని అన్నారు. వైసీపీ హయాంలో నిర్లక్ష్యం వల్ల నాలుగేళ్ల జాప్యం కావడంతో పాటు ఆ కంపెనీకి వివిధ కారణాలతో రూ.120 కోట్లు అదనం భారం పడిందని వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి ప్రోత్సాహం ఇవ్వడంతో పనులు పూర్తి చేసి.. విజయవంతంగా ట్రైల్ రన్ పూర్తి చేశారని అన్నారు.

క్రమశిక్షణతో వికసిత్ భారత్‌ను సాధించాలి

- కల్నల్ అలోక్ త్రిపాఠి
- 9వ ఆంధ్ర బాలికల ఎన్‌సీసీ బెటాలియన్ శిక్షణ ప్రారంభం

నంద్యాల హాస్పిటల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ కేడెట్లు క్రమశిక్షణతో పని చేసి 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణానికి మార్గం సుగమమం చేయాలని కల్నల్ అలోక్ త్రిపాఠి అన్నారు. శనివారం నంద్యాలలోని రామకృష్ణ అటానమస్ డిగ్రీ, పీజీ కళాశాలలో 9వ ఆంధ్ర బాలికల ఎన్‌సీసీ బెటాలియన్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలలో పది రోజులపాటు శిబిరం నిర్వహణకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసిన డా. రామకృష్ణారెడ్డిని అభినందించారు. ఈ శిక్షణా శిబిరంలో ఎన్‌సీసీ కేడెట్లు వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, హెల్త్ అండ్ హైజెనింగ్, యోగా గెస్ట్ లెక్చర్స్, ఫైరింగ్, డ్రిల్, స్పోర్ట్స్ యూనిటి పర్సనాలిటీ డెవలప్‌మెంట్, తల్‌సైనిక్ క్యాంప్ (టీఎస్‌సీ), రిపబ్లిక్‌డే పెరేడ్ (ఆర్డీసీ) సెలెక్షన్స్ తదితర అంశాలు ఉంటాయన్నారు. మంచి అలవాట్లతో, వ్యక్తిత్వంతో ఎదిగినపుడు దేశం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. డా. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ శిబిరానికి 600 మంది కేడెట్స్ హాజరయ్యారని, ఈ శిబిర నిర్వహణకు అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చామన్నారు. అనంతరం కర్నూలు ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్ డా. రామకృష్ణారెడ్డికి గౌరవ అభినందన అవార్డును కల్నల్ అలోక్ త్రిపాఠి అందజేశారు. అనంతరం కళాశాల యాజమాన్యం కల్నల్ అలోక్‌త్రిపాఠి, కల్నల్ జోబి ఫిలిఫ్, లెఫ్టినెంట్ కల్నల్ శ్రీప్రియలను మెమెంటోలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్లు డా. లలితా సరస్వతి, కమల్‌ఖాన్, లక్ష్మీదుర్గ, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.


గౌరవ అభినందన అవార్డు అందుకుంటున్న రామకృష్ణారెడ్డి

మళ్లీ మొదటికొచ్చిన శ్మశాన స్థల వివాదం

- రోడ్డుపై బైఠాయించిన దళితులు
- అడ్డుకున్న బీసీ వర్గాలు ధర్నాను విరమింపజేసిన పోలీసులు

మంత్రాలయం, మే 31 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో శ్మశాన స్థల వివాదం మళ్లీ మొదటికొచ్చింది. గత మూడు నెలలుగా కొనసాగుతున్న ఈ వివాదం శనివారం ఘర్షణకు దారి తీసింది. దళితులు తమ ఇళ్ల ముందు గోతులు తీసి మృతదేహాలను పూడుస్తున్నారని, వారు హైవే రోడ్డుపై బైఠాయించారు. దీంతో మంత్రాలయానికి వచ్చే వాహనాలు ఆగిపోయాయి. మంత్రాలయం సీఐ రామాంజులు, మాధవరం ఎస్ఐ విజయకుమార్ తమ సిబ్బందితో అక్కడికి వచ్చి ధర్నాను విరమింపజేశారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహసీల్దార్ ఎస్. రవి, ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రలతో మాట్లాడి సమస్యను పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో దళితులు ధర్నా విరమించారు. శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కురువ రామన్న అంత్యక్రియల తర్వాత కొందరు దళితుల ఇండ్లపై దాడులకు సిద్ధమయ్యారు. రోడ్డు పక్కన దళితుల ఇళ్ల ముందు భక్తులు పార్కింగ్ చేసిన కారు అద్దాలను బీసీ వర్గాలు ధ్వంసం చేయడంతో దళితులు మంత్రాలయం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. గ్రామంలోని అన్ని కులాలవారు ఏకమై తమ ఇండ్లపై దౌర్జన్యానికి వచ్చారని, భద్రత కల్పించాలన్నారు. గత మూడు నెలలుగా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ఈ వివాదం ముదురుతున్నదని, వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి శ్మశానానికి రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు.


చెట్నహళ్లి గ్రామంలో రోడ్డుపై ధర్నా చేస్తున్న దళితులు

ఓపీ రోగులకు ఆధార్ తప్పనిసరి

- రేపు రెండో ప్రధాన గేటు ప్రారంభం
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు



కర్నూలు హాస్పిటల్, మే 31 (ఆంధ్రజ్యోతి): పెద్దాసుపత్రికి ఓపీ కోసం వచ్చే రోగులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తెచ్చుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం మధ్యాహ్నం సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రోగులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీ కార్డు ఆధార్ లింక్‌తో ఇస్తామన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంటు కార్డు ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేకమైన డిజిటల్ ఐడీ అన్నారు. యూనివర్సల్ హెల్త్ ఐడీ కార్డు ద్వారా ఒకసారి ఓపీని ఆధార్ మొబైల్‌తో లింక్ చేసుకుంటే దేశంలో ఎక్కడైనా ఏ రాష్ట్రంలోనైనా రోగికి సంబంధించి ఆరోగ్య వివరాలు, రిపోర్టులు ఉంటాయన్నారు. ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు సోమవారం ఆసుపత్రిలో రెండో ప్రధాన ద్వారాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ గేటు ముందు ఎవరూ వ్యాపారాలు ఏర్పాటు చేసుకోరాదని, గేట్ ఎదుట ఆటోలు నిలుపరాదని అన్నారు. పార్కింగ్ కోసం స్థలాలను గుర్తించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్‌గా డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్

కర్నూలు హాస్పిటల్, మే 31 (ఆంధ్రజ్యోతి): దైవందిన్నె పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.ఎన్. మహేశ్వర్ ప్రసాద్ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) జిల్లా కోఆర్డినేటర్ ఎన్‌సీడీ నోడల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. శనివారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళకు జాయినింగ్ రిపోర్టు అందజేసి ఆయన విధుల్లో చేరారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న మహేశ్వర్ ప్రసాద్

రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలకు
దరఖాస్తుల స్వీకరణ



కరపత్రం విడుదల చేస్తున్న సీపీ వెంకటేశ్ తదితరులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 31(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రజక కులానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కోసం దరఖా స్తు చేసుకోవాలని రజక విద్యాసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సీపీ వెంకటేశ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక అబ్దుల్లాఖాన్ ఎస్టేట్ స్కంద బిజినెస్ పార్కులోని రజక విద్యాసేవా సమితి కార్యాలయంలో రజక ప్రతిభా పురస్కారాలకు సంబంధించిన కరపత్రాన్ని సీపీ వెం కటేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పదో తరగతిలో 450 పైగా మార్కులు, ఇంటర్‌లో 800 మార్కులు పైగా సాధించిన విద్యార్థులకు, డిగ్రీలో 80 శాతం, బీటెక్‌లో 80 శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కా రాలు అందజేస్తామన్నారు. అలాగే ఎంసెట్, మెడిసిన్, ఇంజనీరింగ్‌లో 10వేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కూడా పురస్కారాలు అందజేస్తామన్నారు. ప్రతిభ పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి జూలై 31 చివరి గడువు అన్నారు. వివరాలకు 9110396511ను సంప్రదించాలని సూచించారు. కార్యక్ర మంలో రాయలసీమ కన్వీనర్ బండారు లింగమయ్య, మహిళా అధ్యక్షులు బాపనపల్లి రాధ, అడ్వకేట్ జగదీష్, వీరశేఖర్, దామగట్ల రమణ పాల్గొన్నారు.

లక్ష మొక్కలు నాటాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హరితాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఒక లక్ష మొక్కలు నాటాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ అధికారులు మొక్కలను అన్ని ప్రదేశాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. కాలనీలు, కొండ ప్రాంతాలు, నీటి సమూహాలు, పార్కులు, కార్యాలయాలు, ఫారం పాండ్స్ తదితర అన్ని ప్రదేశాలలో మొక్కలు నాటాలని ఆదేశించారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ ఫారెస్టు ఆఫీసర్ శ్యామల, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, మెప్మా పీడీ నాగశివలీల, ఫారెస్టు రేంజర్ తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేసవి శిక్షణ ముగింపు వేడుకలు

కర్నూలు కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో బాలలకు వేసవి సెలవుల సందర్భంగా గత నెలరోజులకు పైగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కన్వీనర్ కరీముల్లా, డ్యాన్స్ మాస్టర్లు జి.నాగరాజు, డి. వెంకట రమణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో కొనసాగిన ఈ శిక్షణల్లో శిక్షణ పూర్తి చేసుకున్న బాలలతో కూచిపూడి, ఆధునిక నృత్యం, శాస్త్రీయ సంగీతంలో ప్రదర్శనలు ఉంటాయని వారు తెలిపారు.

రోగులకు ఎనలేని సేవలందించారు

● కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ
● డాక్టర్ సీతారామయ్యకు సన్మానం



సీతారామయ్య దంపతులను సన్మానిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యుల సంఘం నాయకులు

కర్నూలు హాస్పిటల్, మే 31(ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్, యురాలజీ ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ డాక్టర్ కె.సీతారామయ్య రోగులకు ఎనలేని సేవలు అందించారని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ కొనియాడారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీ న్యూ లెక్చరర్ గ్యాలరీలో డాక్టర్ కె.సీతారామయ్య పదవీ విరమణ కార్యక్రమం ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.చిట్టి నరసమ్మ కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కర్నూలు జీజీహెచ్‌లో ముగ్గురు రోగులకు కిడ్నీ మార్పిడి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. యురాలజీ విభాగానికి పీజీ సీ ట్లు రావడానికి ఎంతో శ్రమించారన్నారు. కార్యక్రమంలో ఏపీజీడీఏ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్, కోశాధికారి డా.డమం శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి డా.రాంశివనాయక్, డా.మాధవీ శ్యామల, డా.జే.జయరాం, వైద్యులు పాల్గొన్నారు.

ఆనందంగా గడపాలి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఆనందంగా గడపాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన జూనియర్ అసిస్టెంట్ ఎస్.శేషాద్రిని సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, అకౌంట్స్ ఆఫీసర్ చండీ ప్రసాద్, ఆర్‌వోలు జునైద్, ఇజ్రాయేల్, టీపీఆర్‌వో వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు రామకృష్ణ, సుబ్బన్న, స్వర్ణలత, మంజూర్ బాషా, శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

ఓర్వకల్లు, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని నన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన ప్రాణేష్‌కుమార్‌ను శనివారం పాఠశాల ఆవరణ లో ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గౌరి నందనరెడ్డి, ప్రేమ్ కుమార్, అన్న సైమన్, లక్ష్మీనారాయణ, లలిత కుమారి, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, పెద్దస్వామి, నాన్‌టీచింగ్ సిబ్బంది జమురుద్దీన్, శ్రీకాంత్, రమణ పాల్గొన్నారు.

3 నుంచి లావుబాలీ దర్గా ఉరుసు

కర్నూలు కల్చరల్, మే 31(ఆంధ్రజ్యోతి): పాతనగరంలో వెలసిన లావుబాలీ దర్గాలో ఖద్దసస్రెహల్ అజీజ్ 396వ ఉరుసు ఉత్సవం జూన్ 3 నుంచి 5వరకు నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి డాక్టర్ సయ్యద్ ఆరిఫ్ పాషా ఖాద్రి శనివారం ఒకప్రకటనలో తెలిపారు. జూన్ 3న రాత్రి 10 గంటలకు తారేమన్ ఖబరలే ముషాయిరా, 4న ఉదయం నమాజ్ తర్వాత గుసులేషరీఫ్, సాయంత్రం అసర్ నమాజ్ తర్వాత హల్‌ఖే జికర్, మగరిబ్ నమాజ్ తర్వాత వలీ అల్లాహ్ గొప్పదనంపై ప్రసంగ కార్యక్రమం ఇషా నమాజు తర్వాత పీఠాధిపతి హజ్రత్ సయ్యద్ షా అబ్దుల్లా హుసైనీ బాద్‌షా ఖాద్రీ ఇంటి నుంచి గంధం ఊరేగింపు ఉంటుందని తెలిపారు.

యంత్రసాయం

● కరువైన కాడెద్దులు
● అన్నింటికీ యంత్రాల వినియోగం
● సాగుకు రైతులు సన్నద్ధం
● సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూపులు

ఓర్వకల్లు, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆధునిక సమాజంలో వ్యవసాయంలో కూడా శాస్త్ర సాంకేతిక మార్పులు సంభవిస్తున్నాయి. ఒకప్పుడు సంప్రదాయ వ్యవసాయ సాగేది. నేడు మాత్రం వ్యవసాయంలో అధిక శాతం యంత్రాలనే వాడుతున్నారు. కూలీల కొరత కూడా ఇందుకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. కాడెద్దులు కొనే స్థోమత లేక రైతులు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఒక జత కాడెద్దులు ధర రూ.50వేల నుంచి రూ.80వేలు ఖర్చు అవుతుంది. వాటి నిర్వహణ సంవత్సరానికి రూ.20వేల వరకు అవుతుంది. అదే ట్రాక్టర్‌తో ఒక ఎకరా దున్నడానికి రూ.1000 ఖర్చు అవుతోంది. విత్తనాలను వేసేందుకు యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. దీంతో అధిక శాతం వ్యవసాయం యాంత్రీకరణపైనే ఆధారపడింది.

ఆశల సాగుకు సన్నద్ధం

ముందస్తు వర్షాల నేపథ్యంలో రైతులు ఎంతో ఆశతో సాగుకు సన్నద్ధమవుతున్నారు. రైతులు విత్తనం వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది పత్తి తదితర పంటలు వర్షాలు లేక తెగుళ్ల సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈసారైనా నమ్ముకున్న భూమి గట్టెక్కించకపోదా అని రైతులు మరోసారి పంటల సాగుకు సిద్ధమయ్యారు. మండలంలో పత్తి 800 హెక్టార్లు, కంది 200 హెక్టార్లు, ఆముదం 100 హెక్టార్లు, మొక్కజొన్న 1000 హెక్టార్లు, మినుములు 100 హెక్టార్లు, వేరుశనగ 500 హెక్టార్లలో సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. పొలాలను దున్నడంలో రైతులు బిజీబిజీ అయ్యారు. సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు.



ట్రాక్టర్ సాయంతో సేద్యం చేస్తున్న రైతు

కాడెద్దులు దొరక్క..



గ్రామాల్లో కాడెద్దులు లేక ఇబ్బందులు పడుతున్నాం. రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది వర్షాల కారణంగా పంటల దిగుబడి గణనీయంగా తగ్గింది.

● నాగరాజు, రైతు

యంత్రాలైతే త్వరగా



గ్రామాల్లో రైతుల వద్ద ఎద్దులు లేకపోవడంతో రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపాల్సిన అవసరం ఉంది. యంత్రాలైతే త్వరితగతిన విత్తనాలు వేయవచ్చు.

● మౌళీశ్వరరెడ్డి, రైతు

సబ్సిడీ విత్తనాలు త్వరగా అందజేయాలి



రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు త్వరగా అందజే యాలి. పొలాలను దుక్కి దున్నుకున్నాం. వర్షం వస్తే విత్తనాలు వేయాలి. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలి. పొలాల్లో విత్తనం విత్తేందుకు సిద్ధంగా ఉన్నాం.

● ఆదాంబాషా, రైతు

దేశంలోకల్లా పింఛన్లు రాష్ట్రంలోనే అధికం

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): దేశంలోకల్లా అధిక మొత్తంలో సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తున్న రాష్ట్రం ఏపీ ఒక్కటేనని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం 48వ వార్డు అమీర్ హైదర్‌నగర్‌లో మంత్రి, నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబుతో కలిసి పలువురు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్ల నగదు సక్రమంగా జరుగుతుందా? లేదా? అని మంత్రి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గడిచిన 11 నెలలుగా ఎలాంటి ఆటంకం లేకుండా పక్కా ప్రణాళికతో పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తున్నామన్నారు. అమీర్ హైదర్‌నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు తొలి దశలో రూ.1.54 కోట్లు కేటాయించి పనులు చేపడుతున్నామని అన్నారు. కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ నగరంలో ప్రతి నెల సుమారు 36 వేల మందికి రూ.16 కోట్ల పింఛన్లు పంపిణీకి ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి టీజీ భరత్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

కర్నూలు రూరల్: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు మండలం ఆర్.కొంతలపాడు గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొని పింఛన్ దారులకు డబ్బులు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన ఆదేశాల మేరకు ఒక రోజు ముందుగానే అవ్వతాతలకు పింఛన్ డబ్బులు పంపిణీ చేశామన్నారు. ఎంపీడీవో రఘునాథ్ మాట్లాడుతూ కర్నూలు మండలంలో పదివేల మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా ఇప్పటికి 9,320 మందికి పంపిణీ చేసినట్లు వివరించారు. కర్నూలు మండలంలో ఇవాళ ఒక్కరోజే 95శాతం పింఛన్లు పంపిణీ చేశామని, మిగిలిన 739మంది లబ్ధిదారులకు పింఛన్ డబ్బులను అంద జేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు కురవ మహానంది, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి ఓబుల్‌రెడ్డి, టీడీపీ నాయకులు బోయ గిడ్డయ్య, గిరిమోహన్ తదితరులు పాల్గొన్నారు.



కొంతలపాడులో దివ్యాంగుడికి పింఛన్ డబ్బులు ఇస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

ఓర్వకల్లు: మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ఎంపీడీవో శ్రీనివాసులు, సర్పంచ్‌లు పింఛన్లను పంపిణీ చేశారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో లబ్ధిదారులకు ఒక్కరోజు ముందే పింఛన్లు అందజేశాన్నారు. మండలంలో 95 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పింఛన్‌దారుడుకి సచివాలయ ఉద్యోగి ఆసుపత్రికి వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశారు. శనివారం మండలంలోని హుశేనాపురం గ్రామానికి చెందిన సయ్యద్ ఇబ్రహీం కర్నూలు ఓమ్ని హాస్పిటల్‌లో గత కొన్ని రోజులుగా అనారోగ్యం బారిన పడి చికిత్స పొందుతు న్నాడు. పింఛన్ డబ్బులు తీసుకోవడానికి ఆయన రాలేని పరిస్థితుల్లో ఉన్నట్లు తెలుసుకున్న సచివాలయ ఉద్యోగి లక్ష్మి ప్రసన్న, టీడీపీ నాయకులు మహబూబ్ బాషా, అన్వర్‌బాషా శనివారం కర్నూలు వెళ్లి ఆసుపత్రిలో ఆయనకు రూ.4వేలు పింఛన్ అందజేశారు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు వీరికి కృతజ్ఞతలు తెలిపారు.



సయ్యద్ ఇబ్రహీంకు పింఛన్ ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



కొమరోలులో భూములను పరిశీలిస్తున్న నాయకులు, దళితులు

ఓర్వకల్లు, మే 31(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొమరోలు గ్రామంలో దళితులు, పేదలు సాగు చేసుకున్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా భూములను దళితులు, పేదలు కొండను చదును చేసి సాగు భూములుగా చేసుకుని పంటలు సాగు చేస్తున్నారని, వాటికి పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని అన్నారు. ఆ భూములను ఏపీఐఐసీ పేరుతో తీసుకుని కొంతమంది రైతులకు మాత్రమే నష్టపరిహారం ఇచ్చారన్నారు. అనంతరం తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో దళిత రైతులు లక్ష్మీదేవి, మద్దయ్య, మల్లేశ్వరి, కుమారి అయ్యమ్మ, రామలక్ష్మమ్మ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వ్యక్తిగత రుణాలు ఇవ్వాలి



ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు న్యూసిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులకు వ్యక్తిరుణాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. శనివారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచు మేనేజర్ వై.రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ నగర పాలక సంస్థలో సుమారు 1300 మంది వరకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారన్నారు. వారికి నేటి వరకు వ్యక్తిగత రుణాలు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి, నాయకులు బాబులాల్, సవారి పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల నిరసన



భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు

గూడూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరసన కొనసాగుతోంది. శనివారం గూడూరులోని పాత బస్టాండ్ ప్రాంతంలో నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికులు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ కార్మికులు గత 24 రోజులుగా వివిధ రకాలుగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. కార్యక్ర మంలో నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికులు అరవింద్, బసవ రాజు, మధు, అంజనేయులు, షబ్బీర్, జయన్న, ఖాజాహుసేన్, ప్రభా కర్, హరిబాబు పాల్గొన్నారు.

చర్చలు విఫలమైతే సమ్మెలోకి కార్మికులు

కర్నూలు న్యూసిటీ, మే 31(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమస్యల పరిష్కారానికి జూన్ 2న రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించిందని, చర్చలు విఫలమైతే సమ్మెలోకి వెళ్తామని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7 నుంచి వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నామన్నారు. జూన్ 2న జరిగే చర్చల్లో సమస్యలు పరిష్కారమైతే యథావిధిగా విధుల్లోకి వెళ్తామని, లేని పక్షంలో సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి యాసిన్ బేగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రంగ, కోశాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కేజే రెడ్డి

కర్నూలు స్పోర్ట్స్, మే 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని కొండారెడ్డి బురుజు కేఎంసీ పార్కులో తైక్వాండో పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా రాగమయూరి బిల్డర్స్ అధినేత, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కేజే రెడ్డి ప్రారంభించారు. సమ్మర్ క్యాంపు తైక్వాండో మార్షల్స్ 70 మంది హాజర య్యారు. క్రీడాకారులకు తన వంతు సాయం చేస్తానని కేజే రెడ్డి తెలి పారు. తైక్వాండో కోచ్ వెంకటేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు

గూడూరు మే 31(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మంజూరు చేస్తుందని కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. శనివారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు అర్హులైన పేదలం దరికీ ఇళ్ల పట్టాలు అందించేందుకు గానూ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇంటి స్థలం లేనివారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ముగిసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ

కోడుమూరు, మే 31(ఆంధ్రజ్యోతి): స్థానిక నాగార్జున విద్యానిలయంలో వేసవి సెలవులో నిర్వహించిన విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. శిక్షణ పొందిన పిల్లలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. స్కూల్ డైరెక్టర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ 40 కంప్యూటర్లు ఏర్పాటుచేసి దాదాపు 220మంది పిల్లలకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ అందించామ న్నారు. దీని వలన పిల్లల్లో కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందుతు న్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు నాగార్జునయాదవ్, ఎద్దుల సూర్యరెడ్డి పాల్గొన్నారు.

జార్జ్‌కు ఘన నివాళి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఏ.క్యాంపు ఫైపర్ ఫార్మసీ కళాశాలలో శనివారం జార్జ్ గ్రూపు సంస్థల వ్యవస్థాపకుడు జార్జ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ జార్జ్ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ కె.మహాలక్ష్మి, అకడమిక్ డీన్ రాజ్‌కుమార్ అధ్యాపకులు పాల్గొన్నారు.

పొగాకు నిర్మూలనపై అవగాహన ర్యాలీ

కోడుమూరు, మే 31(ఆంధ్రజ్యోతి): పొగాకు నుంచి వచ్చే నష్టాలపై వైద్యశాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థాని క పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మదన్‌శేఖర్ మాట్లాడుతూ దూమపానం, గుట్కా, ఖైనీ, జర్దా, సిగరేట్టు వాడటం వలన శరీరంలో ప్రతి అవయవాన్ని నాశనం చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యబృంద నరసప్ప, కమాల్, నవీన్, సుమలత, తిరుమలమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

పొగాకుతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

కర్నూలు హాస్పిటల్: పొగాకు ఉత్పత్తులతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఈవ్యసనాన్ని మానుకోకపోతే జీవితం అంధకారం అవుతుందని జి.పుల్లారెడ్డి దంత వైద్యశాల సీనియర్ దంత వైద్యులు వై.మురళీధర్ రెడ్డి, భారతి, జి.మంజునాథ్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం నగరంలో జి.పుల్లారెడ్డి డెంటల్ హాస్పిటల్ దంత వైద్యవిద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పాసివ్ స్మోకింగ్‌తో ప్రమాదకరం: నేరుగా సిగరెట్ కాల్చేవారికి వచ్చే జబ్బులన్నీ వారి పక్క నుంచి వదిలిన పొగను పీల్చిన వారికి పాసివ్ స్మోకింగ్‌తో ప్రమాదం ఏర్పడుతుందని కర్నూలు మెడికవర్ హాస్పిటల్ పల్మనాలజిస్టు డాక్టర్ కె.సువర్ణలక్ష్మి హెచ్చరించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డాక్టర్ సువర్ణలక్ష్మి మాట్లాడారు. పొగత్రాగడం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, నోటి క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. కార్యక్ర మంలో హాస్పిటల్ కర్నూలు క్లస్టర్ హెడ్ డాక్టర్ వై.మహేశ్వరరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.



కోడుమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

సమస్యను పరిష్కరించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 31(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ హాల్ టికెట్ డౌన్‌లోడు సమస్యతో అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డీవైఎఫ్ఐ డిమాండ్ చేసింది. డీవైఎ ఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం సెయింట్ క్లారెట్ పాఠశాలలో డీఈవో శామ్యూల్‌పాల్‌ను కలిసి సమస్యను వివరించారు. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు అప్లయ్ చేసుకున్న వారికి ఒక పోస్టుకు మాత్రమే కేటీ సమయం చూపిస్తుందని, మిగిలిన పోస్టులకు హాల్‌టికెట్ ఎప్పుడు పరీక్ష ఉంటుందో, సెంటర్ వివరాలు తెలియడం లేదన్నారు. వెంటనే అప్లయ్ చేసుకున్న అభ్యర్థులందరికీ అన్ని పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు ప్రభుత్వం అందుబాటులో పెట్టాలని డిమాండ్ చేశారు.

విజయంతో తిరిగి రండి: డీఎస్‌డీవో

కర్నూలు స్పోర్ట్స్, మే 31(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు విజయంతో తిరిగి రావాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. 12వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ పవర్ లిఫ్టింగ్ పోటలు జూన్ 2న జరగనున్నాయి. పోటీలకు హాజరయ్యే కర్నూలు లిఫ్టర్లకు డీఎస్‌డీవో శనివారం వీడ్కోలు పలికారు. కోచ్ యూసుఫ్ బాషా, నిర్వహక కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలి

గూడూరు మే 31(ఆంధ్రజ్యోతి): రైతులందరికీ సబ్సిడీ విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కేవీ నారాయణ, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జే.మోహన్ కోరారు. శనివారం గూడూరు పట్టణంలో సీపీఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందిం చాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దానమన్న, మద్దిలేటి, కొమ్ము రాజు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి

సి.బెళగల్, మే 31(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ అధికారుల సలహాలను తప్పనిసరిగా పాటించాలని బనవాసి ఫారానికి చెందిన శాస్త్రవేత్త శివకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని కంబంధహాల్ గ్రామంలో ఏవో మల్లేష్‌కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా శాస్త్రవేత్త శివకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ అనే కార్య క్రమాన్ని ఏర్పాటు చేసిం దన్నారు. కర్నూలు ఏడీ సాలు రెడ్డి, డీఆర్సీ గిరీశ్, ఎంపీఈవోలు, రైతులు పాలొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త శివకృష్ణ

పశువుల ఆసుపత్రి నిర్మాణాన్ని ఆపాలి



సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న డీఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దొడ్డనకేరి ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో పశువుల ఆసుపత్రి నిర్మాణాన్ని ఆపాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధనాపురం ఉదయ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి బాలు కోరారు. శనివారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాల విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడా మైదానం చాలా అవసరం అన్నారు. 1100 మంది ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పశువుల ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం మంచిది కాదన్నారు. ఆటస్థలం లేక విద్యార్థులు క్రీడలకు దూరమయ్యే అవకాశం ఉందని ఆసుపత్రి నిర్మాణాలు జరగకుండా చూడాలని కోరారు. 12 రోజుల్లో పాఠశాలలో పునఃప్రారంభమవుతాయని పూర్తి చేయాలని తక్షణమే ఆటో స్థలాన్ని కాపాడాలన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు రుణపడి ఉంటాం



తుగ్గలి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డీలర్లు

తుగ్గలి, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రుణపడి ఉంటామని డీలర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడు పగిడిరాయి సుంకన్న, గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, తిమ్మప్ప యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన తుగ్గలి తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల డీలర్లు ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి తహసీల్దార్ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజులతో పాటు డీలర్లు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీలర్లు రామచంద్రారెడ్డి, గౌరన్న, రామచంద్ర, వెంకటేశ్వర రెడ్డి, రంగనాయకులు, బసవరాజు తదితరులు ఉన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలి



కేపీ గుడిసెలలో వెంకటపతిని సన్మానిస్తున్న మాజీ జడ్పీటీసీ నారాయణ్ నాయక్

తుగ్గలి, మే 31 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు వెనుకబడిన వారిని, వారి అభివృద్ధి కోసం కృషి చేయాలని మాజీ జడ్పీటీసీ సభ్యులు నారాయణ్ నాయక్ కోరారు. శనివారం కేపీ గుడిసెల్లో రాష్ట్ర ట్రైబల్ సలహా మండలి సభ్యులుగా ఎంపికైన వెంకటపతిని శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని గిరిజన గ్రామాలు చాలా వెనుకబడి ఉన్నాయని, వాటి అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు రాజు నాయక్, గిరిజన సంఘం నాయకులు రాము నాయక్ ఉన్నారు.

వైసీపీ యూత్ రాష్ట్ర కార్యదర్శిగా చంద్రశేఖర్

ఆలూరు, మే31(ఆంధ్రజ్యోతి): వైసీపీ యూత్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి కుమారుడు బుసినే చంద్రశేఖర్‌ను నియమిస్తూ పార్టీ అధిష్టానం ఎన్నిక చేసింది. తనకు రాష్ట్ర యూత్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షులు ఎస్.వి.మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే విరుపాక్షికు చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థాయిలో యువతను సమాయత్తం చేసి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతానన్నారు.

చెరువులో కంపచెట్లు



జొన్నగిరి చెరువులో పెరిగిన కంప చెట్లు

తుగ్గలి, మే 31 (ఆంధ్రజ్యోతి): చెరువులో నీళ్లు ఉన్నా కూడా ఆ చెరువులో కంప చెట్లు పెరగడంతో చెరువులో చుక్క నీరు కూడా వాడుకోవడానికి లేకుండాపోయింది. ఆ కంప చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. జొన్నగిరి చెరువులో కంపచెట్లుతో నిండి ఉండటంతో చెరువులో చేపలు ఉన్నా, వాటిని పట్టుకోవడానికి వలలు వేసి పట్టుకోవడానికి ఇబ్బందిగా ఉందన్నారు. అంతేగాకుండా కనీసం పశువులు కూడా నీరు తాగేందుకు వెళ్లలేని దుస్థితి ఉందన్నారు. చెరువులో ఉన్న కంప చెట్లను తొలగిస్తే నీరు ఉపయోగపడుతుందని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

మెడికల్ ఆఫీసర్ ఏకపక్ష ధోరణి

● రూ. 4 కోట్ల నిధులు ఎమ్మెల్యే తెచ్చారా...?
● కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల నిలదీత



మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్ పార్వతి

ఆదోని, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఆదోని, మే 31 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కౌన్సిల్‌ను నిర్లక్ష్యం చేస్తూ మెడికల్ ఆఫీసర్ ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారని కౌన్సిలర్లు మండిపడ్డారు. శనివారం చైర్‌పర్సన్ లోకేశ్వరి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ సందీప్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కుక్కల సంతానోత్పత్తి నివారణ కేంద్ర ప్రారంభానికి చైర్మన్‌కు, కౌన్సిలర్లకు కనీస సమాచారం ఇవ్వకపోవడం మంచిది కాదన్నారు. ప్రొటోకాల్ ఉందన్న విషయాన్ని అధికారులు గమనించాలన్నారు. కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వంతో రూ.4కోట్లు నిధులు విడుదల చేయించామని పదేపదే చెబుతున్నారని, ఆ నిధులు విడుదల చేయించి ఉంటే ప్రజలకు తెలపాలని కృష్ణను ప్రశ్నించారు. నిధుల విషయం తమకు సమాచారం లేదని కమిషనర్ సమాధానం ఇచ్చారు. అభివృద్ధికి వైస్ సిటీ కౌన్సిలరులు అడ్డుపడుతున్నారని ఎమ్మెల్యే పదే పదే మాట్లాడడం మానుకోవాలని సూచించారు. టీడీపీ కౌన్సిలర్ పార్వతి మాట్లాడుతూ తమ వార్డులో విద్యుత్ సౌకర్యం కల్పించాలని కౌన్సిల్ దృష్టికి తీసుకొస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ డాక్టర్ అనుపమ, ఇంజనీరులు చలపతి రెడ్డి, రామ్మూర్తి, కౌన్సిలరులు అశోకు, చిన్న, రాజశేఖర్ రెడ్డి, వాసిమ్, ఇంతియాజ్, లక్ష్మి, లలితమ్మ, భారతి, కీర్తన పాల్గొన్నారు.

కడప మహానాడు ఓ అద్భుతం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

పత్తికొండ, మే30 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగిన టీడీపీ మహానాడు ఓ అద్భుతమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగిన మహానాడులో 14అంశాలపై పార్టీతీర్మానాలు చేసిందన్నారు. నారాలోకేశ్ ప్రవేశపెట్టిన 6శాసనాలు కీలక అంశాలన్నారు. కడప ఎవరి అడ్డాకాదని మహానాడు కార్యక్రమం నిరూపించిందన్నారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, తిరుపాల్, తిమ్మయ్యచౌదరి, వెంకటపతి, మనోహర్‌చౌదరి, కాకర్ల లక్ష్మీనారాయణ, బీటీగోవిందు, ఉచ్చీరప్ప ఉన్నారు.

టీడీపీతోనే దళితులకు న్యాయం

టీడీపీతోనే దళితులకు న్యాయం సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల రమేష్ అన్నారు. శనివారం పత్తికొండలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఏబీసీడీ వర్గీకరణకు మొట్టమొదట మద్దతును ఇచ్చింది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని, ఆయన ఆధ్వర్యంలో ఏబీసీడీ వర్గీకరణ పూర్తయిందన్నారు. అదే రీతితో పత్తికొండ నియోజకవర్గంలో దళితులకు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అండగా నిలుస్తూ వారి అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. ఆయనతో పాటు టీడీపీ ఎస్సీసెల్ నాయకులు తిరుపాల్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.

కోర్టు నూతన భవన నిర్మాణానికి స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారులు

పత్తికొండ టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలో శనివారం జూనియర్ సివిల్ కోర్టు నూతన భవనాన్ని నిర్మించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి జ్యోష్ణదేవి పరిశీలించారు. శనివారం స్థానిక మంద్రో బావి సమీపంలో ఉన్న స్థలాన్ని వారు పరిశీలించారు. పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు నూతన భవన నిర్మాణం కోసం స్థళాన్ని పరిశీలించి నివేదికలను జిల్లా జడ్జికి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు మధుబాబు, న్యాయవాది దామోదర ఆచారి ఉన్నారు.

దేవాలయ భూములకు వేలం



ఆలయ భూములకు వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

చిప్పగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దౌల్తాపురంలో కొలువై ఉన్న సీతారామ, లక్ష్మణ, అంజనేయ స్వామి దేవాలయాల వేలం నిర్వహించినట్లు ఈవో రాధాకృష్ణ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో మొత్తం దేవాలయాల భూములు 138 ఎకరాలు ఉన్నాయని, ముందుగా రైతులు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారని చెప్పారు. భూములను కౌలుకు తీసుకోవడానికి చాలామంది రైతులు పోటీపడ్డారు. భూముల సారవంతాన్ని బట్టి ఎకర రూ. 5వేలు నుంచి రూ.15వేలు ధర పలికినట్లు ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్లు రాజు, నరేంద్ర, లక్ష్మన్న, మాజీ ధర్మకర్త మేకల దామోదర్, హరి, శీనా, ఆటో సుంకన్న, చంద్ర, చిరంజీవి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కోటా కోసం కొట్లాట

● బియ్యం లారీని అడ్డుకున్న జనసేన
● నెట్టేకల్లులో టెన్షన్.. టెన్షన్

ఆదోని రూరల్, మే 31 ఆంధ్రజ్యోతి): చౌక దుకాణాల ద్వారా ప్రజలకు పంపిణీ చేయాల్సిన బియ్యం కోటా కోసం కూటమి ప్రభుత్వంలోని పార్టీల నాయకులు కయ్యానికి కాలుదువుతున్నారు. టీడీపీ నాయకుడికి కేటాయించిన బియ్యాన్ని జనసేన నాయకులు అడ్డుకోవడంతో నెట్టేకల్లులో హై టెన్షన్ నెలకొంది. పోలీసులు వస్తేగాని సమస్య సర్దు మణగలేదు. ఆదోని మండలం నెట్టేకల్లు గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి జనసేనకు చెందిన భీమన్న ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. అయితే జూన్ 1నుండి టీడీపీ నాయకుడు నాగరాజుకు రెవెన్యూ అధికారులు ప్రజాపంపిణీ చేసే కార్యక్రమాన్ని అప్పజెప్పారు. దీంతో శనివారం గ్రామానికి నాగరాజు ఇంటికి బియ్యం లోడు వచ్చింది. ఈ విషయం తెలిసిన జనసేన నాయకులు భీమన్న, అంజనేయ, లోకేష్ తదితరులు రోడ్డుపై బియ్యం లారీని అడ్డుకొని నానా హంగామా చేశారు. దాదాపు 5గంటల నుండి రాత్రి 7గంటలు దాటినా బియ్యం లారీని అడ్డుకోవడంతో లారీ రోడ్డుపైనే ఆగిపోయింది. విషయం తెలుసుకున్న తాలుక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ప్రభుత్వం ఎవరికి కేటాయించింటే వారు ఈ బియ్యం ప్రజలకు పంపిణీ చేయాలని, మిగిలిన వారు ఇక్కడి నుంచి వెళ్ళి పోవాలన్నారు. లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నెట్టేకల్లు గ్రామానికి ఈనెల బియ్యం కోటా నాగరాజుకు కేటాయించామని సివిల్ సప్లయ్ డిటి వలి బాషా తెలిపారు.

స్వర్ణామృత ప్రాసనం పంపిణీ



పిల్లలకు స్వర్ణామృత ప్రాసనం పంపిణీ చేస్తున్న ఆవోపా నాయకుడు కాకుబాల్ నగేష్

ఆదోని అగ్రికల్చర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వికాస తరంగిణి సాకారంతో చిన్న పిల్లలకు స్వర్ణామృత ప్రాసనం మందులను పంపిణీ చేశారు. శనివారం స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన స్వర్ణామృత ప్రాసనం పంపిణీలో ఆవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనివాస గుప్తా, మాజీ అధ్యక్షుడు కాకుబాల్ నగేష్ మాట్లాడుతూ చిన్నారులకు రోగనిరోధక శక్తి కోసం స్వర్ణామృత ప్రాసనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మేధాశక్తిని ఆయుష్షును మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. 186 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆవోపా సభ్యులు డైమండ్ రఘు, వెంకటేష్ బాబు, రాఘవేంద్ర, మమతశ్రీ, శ్రీదేవి పాల్గొన్నారు.

అధ్వానంగా ఆలూరు ఉప కాలువ



ఏబీసీ 25 కిలోమీటర్ల వద్ద రక్షణ లేని వంతెన

చిప్పగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆలూరు ఉప కాలువ (ఏబీసీ) కంప చెట్లు పెరిగి వంతెనలు కూలి, పూడికతో అధ్వానంగా మారింది. ఈ కాలువ కింద చిప్పగిరి, ఆలూరు, హాలహర్వి మండలాల పరిధిలో 14,265 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. కాలువకు జూన్ నెలలో నీటిని విడుదల చేస్తారు. ఇప్పటి వరకు కాలువను ఎలాంటి మరమ్మతు చేయకపోవడంతో ఆయకట్టు పొలాలకు సాగునీరు అందడం గగనంగా మారింది. ఏబీసీ ప్రధాన కాలువ 25 నుంచి 28 కిలోమీటర్ వరకు చెట్లు విపరీతంగా పెరిగాయి. పలుచోట్ల వంతెనల రక్షణ గోడలు కూలిపోయాయి. కాలువ గట్లు దెబ్బతిన్నాయి. తక్షణమే కాలువను మరమ్మతు చేయకుంటే ఏబీసీలు చివరి ఆయకట్టు దారులకు ఈ ఏడాది సాగు నీరు అందడం ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ విషయంపై డీసీ ప్రెసిడెంట్ నరడోన కిష్టప్పను వివరణ కోరగా, కాలువ పరిస్థితిని కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, ఇంజనీర్లు ప్రతిపాదన పంపించారని, నిధులు వచ్చాక కాలువను మరమ్మతు చేయిస్తామని అన్నారు.

పింఛన్‌తో కుటుంబానికి ఆసరా



తుగ్గలిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న తుగ్గలి నాగేంద్ర



ఆస్పరిలో పింఛన్లును పంపిణీ చేస్తున్న వైకుంఠం జ్యోతి

తుగ్గలి, మే 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన పింఛన్ పెంచి ఇస్తామని ఇచ్చిన హామీని అమలు మాట నిలబెట్టుకుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఒకరోజు ముందే పింఛన్లు పంపిణీ చేశారు. తుగ్గలిలో తుగ్గలి నాగేంద్ర దంపతులు ఇంటింటికి తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వరలక్ష్మి, సర్పంచ్ రవి, వార్డు మెంబర్లు ఆకుల శీనప్ప, ఎరుకుల సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్రిష్ణగిరి: మండలంలోని గ్రామాలలో సచివాలయ అధికారులు శనివారం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. .మాదాపురం గ్రామంలో కర్నూల్ పార్లమెంట్ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి మాదాపురం ప్రసాద్ పింఛన్లను లబ్ధిదారులకు అందించారు.

ఆస్పరి: ఆస్పరిలో వృద్ధాప్య, వితంతువు, వికలాంగ పింఛన్ల నగదును ఆలూరు నియోజకవర్గ టీడీపీ నాయకురాలు వైకుంఠం జ్యోతి పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీలు రత్నమ్మ, కృష్ణయాదవ్, వెంకటేష్, జనసేన మండలాధ్యక్షుడు అరవింద్‌యాదవ్, జీవన్‌కుమార్, సంజన్న, యాగంటి కృష్ణ, రాఘవేంద్ర, సోమలింగ, రాజశేఖర్, వీరేష్ పాల్గొన్నారు.

ఆలూరు: పట్టణంలో ఇందిరానగర్‌లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మండల టీడీపీ కన్వీనర్ అశోక్‌యాదవ్ శనివారం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఆదివారం సెలవు కావడంతో వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసప్ప, కొమ్ము రామాంజనేయులు, గూళ్యం రామంజి, రాముయాదవ్, ఉలిగప్ప, పెయింట్ గోవింద్, అంజి పాల్గొన్నారు.

ఆదోని రూరల్: మండలంలోని పింఛన్ల పంపిణీ 95శాతం పూరయింది. జూన్ 1 ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేశారు. మొత్తం 11వేల 460మంది పింఛన్‌దారులు ఉండగా, ఇందులో 95శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన వారందరికీ పింఛన్లను అందించే బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని టీడీపీ రాష్ట్ర నాయకులు బసాపురం వెంకటేశులు తెలిపారు.

దేవాలయ అభివృద్ధికి కృషి



దేవతామూర్తులకు పూజలు చేస్తున్న శ్రీనివాసులు, రాధ దంపతులు

మద్దికెర, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక పందుల కుంటలో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి దేవాలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని దాతలు పత్తికొండ కూరగాయల శ్రీనివాసులు, రాధ దంపతులు అన్నారు. శనివారం అయ్యప్పస్వామి గర్భగుడి దాతలైన బెల్దోన నారాయణ, నాగలక్ష్మి కుమారుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో గర్భగుడి ద్వార బంధం కార్యక్రమాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నీలకంఠరాయుడు, టీడీపీ నాయకులు నాగప్ప స్వామి, కృష్ణ, బీసన్న, భీమరాజు, గంధం గోపాల్, తుగ్గలి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాల అధికారి రాజారఘువీర్

వెల్దుర్తి, మే 31(ఆంధ్రజ్యోతి): బియ్యం కార్డుదారులకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి రాజారఘువీర్ ఆదేశించారు. శనివారం డిప్యూటీ డైరెక్టర్ కమిషనర్ కార్యాలయం పౌర సరఫరాల శాఖ, జిల్లా ప్రత్యేకాధికారి మోహన్‌బాబుతో కలిసి మండలంలో ఉన్న చౌకదుకాణం డీలర్లతో సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాల ద్వారా సరుకుల పంపిణీ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. పాత పద్ధతిలోనే చౌకదుకాణాల ద్వారా రేషన్ పంపిణీకి జూన్ 1వ తేదీ నుంచి శ్రీకారం చుట్టిందన్నారు. తూకాల్లో అవకతవకలకు పాల్పడితే డీలర్‌షిప్ రద్దుచేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గురుస్వామి, ఆర్ఐ మంజుల పాల్గొన్నారు.

డీలర్లు అందుబాటులో ఉండాలి

దేవనకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): రేషన్ కోసం దుకాణాలకు వచ్చే ప్రజలకు డీలర్లు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ ప్రసాదురాజు అన్నారు. శనివారం మండలంలోని కరివేములలోని రేషన్ దుకాణాలను తనిఖీ చేసి, ప్రజలకు డీలర్లు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే రేషన్‌లో అవకతవకాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. 1 నుంచి 15 వరకు కార్డుదారులకు రేషన్ అందజేయాలన్నారు. ఆర్ఐ లక్కిరెడ్డి విజయభాస్కర్, వీఆర్వో రాజన్న, తదితరులు ఉన్నారు.

ఆదోని రూరల్: గ్రామాల్లో ఆదివారం నుంచి డిలర్లే రేషన్ పంపిణీ చేస్తారని తహసీల్దార్ శివరాముడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు, 65ఏళ్ల పైబడ్డ వృద్ధులకు వారి ఇంటివద్దకే సంబంధిత డీలర్లు బియ్యం సరఫరా చేస్తారని తెలిపారు.

పత్తికొండ టౌన్: రేషన్ చౌక దుకాణాల వద్దనే నిత్యావసర సరుకులను డీలర్లు అందజేస్తారని, ప్రజలు డీలర్ల షాపు వద్దకు వెళ్లి ప్రభుత్వం అందించే సబ్సిడీ నిత్యావసర సరుకులు పొందాలని తహసీల్దార్ రమేష్ అన్నారు. శనివారం తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో ఎండీయూ వాహనాలతో ఇంటింటికి సరుకులు అందించేవారని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ నెల నుంచి రేషన్ దుకాణాల దగ్గర డీలర్లు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తారన్నారు. పట్టణం శివారులో కందోలి రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డు (చెత్త కేంద్రం)ను హోసూరు రోడ్డులో ఉన్న సర్వే.నెంబర్.286కు మార్చడం జరుగుతుందన్నారు. డంపింగ్ యార్డు వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు కూడా ఆదేశాలు ఇచ్చామన్నారు. త్వరితగతిన పారిశుధ్య పనులు చేపట్టాలని పేర్కొన్నారు.

పొగాకుకు దూరం ఉండండి

మద్దికెర, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పొగాకు వాడడం వల్ల అనారోగ్య పాలవుతారనీ ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణీలు అన్నారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పొగాకు వాడకూడదని, వాడనీయమని ప్రతిజ్ఞ చేశారు. వారు మాట్లాడుతూ పొగాకు తీసుకోవడం వల్ల మన శరీరంలో ప్రతి అవయవాలు దెబ్బతింటాయన్నారు. జీవితంలో పొగాకుకు, వాటికి సంబంధించిన ఉత్పత్తులను వాడనని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది జిలానీబాషా, నిరంజన్‌బాబు, అక్బర్ బాషా, విజయకుమార్ ఉన్నారు.

టీబీని నియంత్రించేందుకు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్

ఆలూరు, మే31(ఆంధ్రజ్యోతి): క్షయ(టీబీ)ని నియంత్రించేందుకు ఆదివారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆలూరు సబ్ డివిజన్ టీబీ సూపర్‌వైజర్ డి.గోపాల్ శనివారం తెలిపారు. గ్రామాల్లోకి 104 అంబులెన్స్ సిబ్బంది ద్వారా గ్రామాల్లో టీబీ పరీక్షలు చేస్తామన్నారు. అనుమానం ఉంటే గల్ల పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలపాటు ఉచితంగా మందులు పంపిణీ చేసి, పోషకాహారం కోసం ప్రభుత్వం నెలకు రూ.1000 చెల్లిస్తుందన్నారు. ఇది అంటువ్యాధి అని, తగు జాగ్రత్తలు తీసుకుంటే ఆరు నెలల్లోపు పూర్తిగా నయం చేయవచ్చన్నారు.

బొంతిరాళ్ల కొండలో చిరుత సంచారం

క్రిష్ణగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయ బొంతిరాళ్ళ కొండలో గత కొన్ని రోజులుగా చిరుత సంచరిస్తోంది. శనివారం ఉదయం పొలాలకు వెళ్ళిన రైతులు, ట్రాక్టర్ డ్రైవర్లు చిరుతను కనుగొన్నారు. తమ సెల్‌ఫోన్లలో చిరుత సంచార దృశ్యాలను బంధించారు. గత కొన్ని రోజులుగా చిరుత సంచారంతో పశువుల కాపర్లు, రైతులు, ప్రజలు భయభ్రాంతులవుతున్నారు. అటవీశాక అధికారులు స్పందించి చిరుత జాడను కనుగొని తగిన చర్యలు తీసుకోవాలని మండల తెలుగుయువత అధ్యక్షుడు మహమ్మద్‌రఫీ, సర్పంచ్ రవిమోహన్ కోరారు.

దుర్వాసన భరించలేకపోతున్నాం



మార్లమాడికి గ్రామంలో బురదతో నిండిన ఎస్సీ కాలనీ

హొళగుంద, మే 31 (ఆంధ్రజ్యోతి) : మార్లమాడికి గ్రామంలోని ఆర్‌డీటీ పాఠశాల వద్ద ఉన్న దళిత కాలనీలో ఇళ్ల మధ్యనే మురుగు నిల్వ ఉంది. దీని నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామని కాలనీవాసులు సుంకమ్మ, కళ్లప్ప, వెంకటేష్ శనివారం వాపోయారు. ఇళ్లముందర మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీలు నిర్మించాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోయారు. ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో చక్రవర్తిని వివరణకోరగా ఎన్ఆర్‌జీఎస్ నిధుల క్రింద సీసీ రోడ్డు కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపమని, నిధులు మంజూరు అయితే సీసీ రోడ్డు వేస్తామన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి


మాట్లాడుతున్న ఈరమ్మ

ఎమ్మిగనూరు రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ) పట్టణ కార్యదర్శి ఈరమ్మ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ఇచ్చిన హామీ మేరకు పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్ల స్థలం ఇవ్వాలన్నారు. అలాగే ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల రుణం ఇవ్వాలన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేసిన ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవాలన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షురాలు వాణి, చాముండి, వెంకటలక్ష్మి, రేణుక, నాగవేణి, సావిత్రమ్మ పాల్గొన్నారు.

'కబ్జాదారుడిని ప్రోత్సహించడం సిగ్గుచేటు'

ఎమ్మిగనూరు, మే 31(ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని గోనెగండ్ల రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటిక కబ్జాదారుడిని ప్రోత్సహించడం సిగ్గుచేటు అని వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం నారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కొన్ని నెలలుగా బీసీ కుల సంఘాల నాయకులు ఆక్రమణకు గురైన భూమిని కాపాడేందుకు పోరాటం చేస్తున్నారని వారికి అండగా నిలవాల్సిన నాయకులు, ప్రభుత్వ అధికారులు వ్యతిరేకంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. పోరాటం చేస్తున్న సంఘాలకు తాను సంపూర్ణ మద్దతు తెలుపుతున్నానన్నారు. స్మశాన వాటిక భూమిని పూర్తిస్థాయిలో సర్వేచేసి విచారణ చేసి ఒక సెంటు భూమి కూడా ఆక్రమణకు గురికాకుండ కాపాడాల్సిన బాధ్యత అధికారులు, పాలకులపై ఉందన్నారు. శ్మశాన వాటికను ఆక్రమించిన వారిపై తగుచర్యలు తీసుకోవాలని కోరారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

మంత్రాలయం, మే 31 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేంత వరకు పోరాడుతామని ఆ సంఘం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు బి.లక్ష్మన్న అన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో అధికారంలో ఉన్న పార్టీలు శాసనసభలో తీర్మానాలు చేసి కేంద్రానికి పంపారని, అక్కడ పెండింగ్‌లో ఉందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఒప్పించి ఎస్టీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించేలా చూడాలని కోరారు. సమావేశంలో వాల్మీకి నాయకులు బీవీ రవిచంద్ర, రాఘవేంద్ర, వరప్రసాద్, వన్నూరు వెంకటేశ్, సుంకప్ప, రఘు పాల్గొన్నారు.

గధక్‌లో మఠం ప్రారంభం


విరాళంతో నిర్మించిన రాఘవేంద్రస్వామి మఠం

మంత్రాలయం, మే 31(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠానికి కర్ణాటకలోని గదక్ పట్టణంలో రూ. రెండు కోట్లతో సుందరంగా నిర్మించిన దేవాలయాన్ని భక్తులు విరాళంగా ఇచ్చారు. శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మృత్తిక బృందావనం గర్భగుడి ప్రాకారం సుందరంగా నిర్మించి విరాళంగా ఇచ్చిన మఠాన్ని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి మృత్తిక బృందావనానికి కలశ పూజ, కుంభాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడే సంస్థాన పూజ, సప్త ముద్రదారణ చేశారు. అనంతరం బృందావనానికి బంగారు, పట్టువస్త్రాలతో, పుష్పాలతో అలంకరించి మహా మంగళహారతులు ఇచ్చి భక్తుల దర్శనానికి అనుమతించారు. భక్తులను పీఠాధిపతి ఆశీర్వదించారు. పవనాచార్, మఠం సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని నియంత్రించాలి


మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులను దోపిడీని నియంత్రించాలని పీడీఎస్‌యూ నియోజకవర్గ అధ్యక్షుడు సాయి తేజ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పీడీఎస్‌యూ కార్యదర్శి డానియల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాయి తేజ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరిఫ్, దయాకర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి

ఎమ్మిగనూరు టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని వైఎస్ఆర్ రాష్ట్ర యువజన విభాగం నూతన ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్ అన్నారు. శనివారం పట్టణంలో బుట్టా ప్రతుల్ మాట్లాడుతూ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులుగా నియమిస్తున్నట్లు వైఎస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు.

పూలచింతలో కంటి వైద్య శిబిరం

నందవరం, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలచింత గ్రామంలో శనివారం సర్పంచ్ అక్కామాంబదేవి, టీడీపీ నాయకులు బండేగురుస్వామి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ అనూష కంటి పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు.


పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనూష

సమస్యల్లో మునెప్పనగర్

● ఇళ్ల మధ్యనే మురుగు
● కంపుకొడుతున్న కాలనీ పరిసరాలు
● ఇబ్బందులు ప్రజలు
● పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ఎమ్మిగనూరు టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): ఉత్తమ మున్సిపాలిటీగా పేరొందిన ఎమ్మిగనూరు మురుగుపాలిటీగా మారింది. కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల మధ్య మురుగునీరు పేరుకుపోయి కంపుకొడుతున్నాయి. ఓ వైపు దుర్వాసన.. మరో వైపు దోమలతో ఆయా కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. మునెప్పనగర్ కాలనీ సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. నేటికీ ఈ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవు. ఇళ్లు నిర్మించుకొని కొన్నేళ్లు గడుస్తున్నాయి. వర్షాలు వచ్చాయంటే ఇళ్లముందు చెరువులను తలపిస్తున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం ఇద్దరు చిన్నారులు ఆడుకుంటూ కుంటలో పడ్డారు. వెంటనే బయటకు తీయడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని వారు పేర్కొంటున్నారు.


మునెప్ప నగర్‌లోని మట్టి రోడ్డు


ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పాలకులు స్పందించి సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు పట్టణ వాసులు కోరుతున్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవు..



ఇరవై ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నాం. కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వచ్చిందంటే ఇళ్ల ముందు చెరువును తలపిస్తుంది. అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించాలి.

- మల్లేష్, మునెప్పనగర్

దోమలకు ఆవాసంగా మారింది



పదేళ్లుగా మునెప్పనగర్‌లో నివాసం ఉంటున్నాం. డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపునీరు ఇక్కడే నిలిచిపోతుంది. దోమలకు ఆవాసంగా మారింది. వర్షం పడిందంటే కాళ్లు బయట పెట్టలేని పరిస్థితి.

- వెంకటేష్, మునెప్పనగర్

పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయింపు


మంత్రాలయం పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించిన చెట్నహల్లి గ్రామ దళితులు, జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు

మంత్రాలయం, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహల్లి గ్రామ శ్మశాన వివాదంలో దళితుల ఇళ్లపైకి వచ్చి దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జిక్కిం జానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్నలు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి మంత్రాలయం పోలీస్ స్టేషన్ ముందు దాదాపు గంటసేపు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసే వరకు కదిలేది లేదని భీష్మించారు. వెంటనే దాడి చేసిన 25 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి దళితులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా జైభీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు దానియేలు, నరసింహులు, రవి, రాజు, మారెప్ప, ఉన్నారు.

చెట్నహల్లిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు: ఇరువర్గాల మధ్య శ్మశాన వివాదం చెలరేగడంతో డీఎస్పీ ఉపేంద్రబాబు ఆదేశాల మేరకు సీఐ రామాంజులు, మాధవరం ఎస్ఐ విజయకుమార్ దాదాపు 20 మంది పోలీసులు చెట్నహల్లి గ్రామంలో బందోబస్తు చేపట్టారు. అనవసరమైన గొడవలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, ఘర్షణలకు ప్రేరేపిస్తే సహించేది లేదని సీఐ రామాంజులు హెచ్చరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం తెల్లవారుజామున 12.30 గంటలకు ఎమ్మిగనూరు మండల పరిధిలోని కొటేకల్లు గ్రామ పరిధిలోని హరితవనం దగ్గర చోటు చేసుకుంది. గంగులపాడు గ్రామానికి చెం దిన లక్ష్మీకాంతరెడ్డి(35)కి మతిస్థిమితం సరిగాలేదు. అర్ధరాత్రి 12.30గంటల సమయంలో కొటేకల్లు సమీపంలోని హరితవనం దగ్గర నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో లక్ష్మీకాంతరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఎమ్మిగనూరు రూరల్ పోలీసులకు సమాచారం అందజేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతుడు అన్న వీరారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

జలచౌర్యానికి పాల్పడిన వారిపై కేసులు

ఎమ్మిగనూరు రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపురం గ్రామంలో జలచౌర్యానికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎల్లెల్సీ ఏఈ రామాంజనేయులు తెలిపారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన "అడిగేవారెవరు..?" అన్న కథనానికి ఎల్లెల్సీ అధికారులు స్పందించారు. ఏఈ రామాంజనేయులు మాట్లాడుతూ జలచౌర్యానికి పాల్పడిన మల్కాపురం గ్రామానికి చెందిన కురువ అయ్యప్ప, గొల్ల నాగరాజు, చాకలి మల్లేష్, గొల్ల సోమేష్, రామాంజనేయులు, బత్తిని కృష్ణయ్య, సురేష్, మారెన్నలపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపామన్నారు.

ఘనంగా అహల్యాబాయి జయంతి

ఎమ్మిగనూరు టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో అహల్యాబాయి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి బీజేపీ నాయ కులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తోగట నరసింహులు, జగ్గాపురం ఈరన్న, రాజేశ్వరి, రాజశేఖర్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో విధ్వంసం

● దశలవారీగా హామీల అమలు
● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, మే 31(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం కొనసాగిందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం వెంకటాపురం కాలనీలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని వైసీపీ నాయకులు గగ్గోలు పెడుతున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారిగా అమలు చేస్తామని ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.వెయ్యి పింఛన్ పెంచేందుకు ఐదేళ్లు పట్టిందని, వారి హామీలు అమలు గురించి అడుగుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు వెళ్తున్నారన్నారు. నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధి చేసి ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ గంగిరెడ్డి, డీఈ నీరజ, నాయక్, ఏఈలు శరత్ చంద్ర, మదన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, వార్డు టీడీపీ ఇన్‌చార్జి బచ్చాల రంగన్న, పెద్ద రంగన్న, ఉరుకుందు, నాయకులు కురువ మల్లయ్య, బుగిడె నాగరాజు, వినయ్, నవాజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ


సూగూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి

చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం

మంత్రాలయం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సూగూరు గ్రామంలో టీడీపీ జిల్లా నాయకులు ఎస్పి భాస్కర్, కాలువ చైర్మన్ నరసింహులు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా ఫించన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. టీడీపీ నాయకులు మాజీ జడ్పీటీసీ ఆర్ లక్ష్మయ్య, జిల్లా అధికారి ప్రతినిధి చావిడి వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, నీలకంఠ, రాముడు, బోజప్ప, రజాక్ పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: మండలంలోని కంబదహాల్ గ్రామంలో సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీ నాయకులు సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మురళీకృష్ణ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వాయుపుత్రుడికి ప్రత్యేక పూజలు

కౌతాళం మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ ఆంజనేయస్వామి దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యంగా బుదుములదొడ్డి, ఎరిగేరి పులిగుట్టు, అగసలదిన్నె ఆంజనేయస్వామి దేవాలయాల్లో అర్చకులు తెల్లవారుజామునే మూలవిరాట్‌ను శుద్ధ జలాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బుదుములదొడ్డి అంజనేయస్వామికి ఆకు పూజ చేశారు. దేవాలయంలో సీతారాముల వారిని ప్రత్యేక రథంతో ఊరేగించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.


అగసలదిన్నెలో పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

మండలానికి సముచిత స్థానం

నందవరం, మే 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ పదవుల్లో మండలానికి సముచిత స్థానం ఇవ్వడం హర్షనీయమని టీడీపీ మండల కన్వీనర్ డీవీ రాముడు అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జులు కాశీంవలి, ధర్మాపురం గోపాల్‌తో కలిసి మాట్లాడారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ల పదవులు అధికంగా నందవరానికి దక్కాయన్నారు. హలహర్వి గ్రామంలో మండ్రి దుబ్బన్నకు, నాగలదిన్నెలో కరణం సుదీర్‌కు, మిట్టా సోమాపురంలో బోయ వెంకటేశ్వరమ్మకు, మాచాపురంలో లక్ష్మీకి, పూలచింత సర్పంచ్ అక్కమాంబదేవి బండేగురుస్వామి, అలాగే బీజేపీకి చెందిన తెలుగు శశికళకు పదవులు కేటాయించారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

స్పెషల్‌గ్రేడ్ మున్సిపాలిటీతో మరింత అభివృద్ధి

ఎమ్మిగనూరు, మే 31(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు స్పెషల్‌గ్రేడ్ మున్సిపాలిటీగా స్థాయి పెరగడంతో పట్టణం మరింత వేగంగా అభివృద్ధి చెంది ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుతాయని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపాలిటీని స్పెషల్‌గ్రేడ్ మున్సిపాలిటీగా హోదా పెంచిందని, మున్సిపల్ అధికారులకు బాధ్యత పెరిగిందన్నారు. ప్రజలకు మంచిగా సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్, డీఈలు నీరజ,నాయక్, ఏఈలు శరత్‌చంద్ర, మదన్, సిబ్బంది సూరిబాబు, జనార్ధన్‌లు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కమిషనర్, సిబ్బంది

మంత్రాలయంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, మే 31(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కోలాహలంగా మారింది. శనివారం జ్యేష్ఠమాసం పంచమి కావటంతో దక్షణాది రాష్ట్రాలనుంచి వే లాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మఠం అతిథి గృహాలు, ప్రైవేట్ లాడ్జిలు భక్తులతో నిండి పోయాయి. అద్దె రూములు దొరకక మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తు లు బసచేశారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్స్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని శ్రీమఠం ఏఏఓ మాధవ శెట్టి, మేనేజరు వెంకటేష్ జోషిలు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు ప్రధాన రహదారిపై ఇరువైపులా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యతో భక్తులు, గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు.


భక్తులతో కిక్కిరిసిన మఠం ప్రాంగణం

తాగునీటి కోసం తిప్పలు


ముళ్ల కంపల్లో నీటి కోసం అవస్థలు పడుతున్న ప్రజలు

నందవరం, మే 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఐదురోజులుగా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు తాగునీటి కోసం కొళాయిలు ఇష్టానుసారంగా వేసుకోవడంతో ఎస్సీ కాలనీకి తాగునీటి తిప్పలు తప్పడం లేదు. గ్రామ శివారులోని కొళాయిలు దగ్గరకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. పాలకులకు, అధికారులకు సమస్యను వివరించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యనారాయణమూర్తి వివరణ కోరగా విద్యుత్ ఇబ్బందుల వల్ల తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. త్వరలో స్తంభాలు ఏర్పాటు చేసి కాలనీకి తాగునీరు సరఫరా చేస్తామన్నారు.

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి

మంత్రాలయం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త యోగాంధ్రలో పాల్గొని విజయవంతం చేయాలని సీడీపీవో నరసమ్మ, ఎంపీడీవో నూర్జహాన్, ఎంఈవో రాగన్న ప్రత్యేక అధికారి నారాయణ అన్నారు. శనివారం పరిమళ విద్యానికేతన్‌లో శిక్షణ పొందిన యోగా టీచర్లు శ్రీకృష్ణ, పరబ్రహ్మ, రవీంద్రలు 200మంది అంగన్‌వాడీ కార్యకర్త లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు యోగాసనాలు చేయించారు. మంత్రాలయం, కోసిగి, పెద్దకడుబూరు మండలాల నుంచి యోగాంధ్ర యాప్‌లో 200మంది రిజిస్ట్రేషన్ పూర్తయినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ


మాట్లాడుతున్న తహసీల్దార్ కుమారస్వామి

గోనెగండ్ల, మే 31(ఆంధ్రజ్యోతి):చౌకదుకాణాల వద్దే ఆదివారం నుంచి రేషన్ పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. శనివారం గోనెగండ్లలోని తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేసిందన్నారు. దుకాణాల దగ్గరనే రేషన్ పంపిణీ చేయాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవన్నారు. పలు గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

కౌతాళం: మండలంలో ఈనెల 1నుంచి రేషన్ సరుకులు చౌకదుకాణాల ద్వారానే పంపిణీ చేస్తామని తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ డీలర్లు అక్రమాలకు పాల్పడితే షాపులను రద్దు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్ఐ లక్ష్మన్న, సీనియర్ అసిస్టెంట్ రామయ్య, డీలర్లు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు కాటాలు పంపిణీ

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని డీలర్లకు రేషన్ కాటాలను తహసీల్దార్ శేషఫణి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 42, పట్టణంలో 44 దుకాణాల డీలర్లకు కాటాలను అందజేశామన్నారు. పేదలకు సరఫరా చేసే నిత్యావసర సరుకులను డీలర్లు రేషన్ గోడౌన్ నుంచి తీసుకెళ్లాలన్నారు. పేదలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరుకులను అందజేశారు. ఎక్కడైనా ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే తమకు సమాచారం అందజేయాలన్నారు.